بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

సంపుటి: 11    www.akhbarbadr.in    సంచిక: 15

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

తేది: 09- ఏప్రిల్ 2026 క్రీ, శ. 09 - షహాదత్ 1405 హి, శ. 20- షవ్వాల్ 1447 హి,ఖ.
వార్షిక చందా: 600/-రూ॥

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

وَيُطۡعِمُوۡنَ الطَّعَامَ عَلٰى حُبِّهٖ مِسۡكِيۡنًا وَّيَتِيۡمًا وَّاَسِيۡرًا ○ اِنَّمَا نُطۡعِمُكُمۡ لِوَجۡهِ اللّٰهِ لَا نُرِيۡدُ مِنۡكُمۡ جَزَآءً وَّلَا شُكُوۡرًا ○ ﴿سُوۡرَةُ الدَّهۡرِ: 9-10﴾

అనువాదం: వారికి అన్నము అవసరమైనను, దానిని బీదవారికి, అనాథలకు, బంధీలకు తినిపించెదరు. ం మేము కేవలము అల్లాహ్ ప్రీతి కొరకు మాత్రమే మీకు తినిపించుచున్నాము. మేము ఎన్నడు మీతో ప్రతిఫలముగాని, కృతజ్ఞత గాని కోరడము లేదు.

(అద్దహర్ 9-10)

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

## మానవ సేవయే - మాధవ సేవ.

హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. హజ్రత్ అబూహురైరహ్ రజి ఇలా ఉల్లేఖించారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. వైభవంతుడైన అల్లాహ్ ప్రళయదినమున ఇలా ప్రశ్నించును. ఓ ఆదమ్ సంతానామా! నేను అనారోగ్యముగా ఉన్నప్పుడు మీరు నన్ను పరామర్శించలేదు?. అందుకు దాసుడు " ఓ నా సంరక్షకుడా! నేను నిన్ను ఎలా పరామర్శించగలను, నిజానికి నీవే భూమండలపు ప్రాణులన్నింటిని సంరక్షించువాడవు " అని సమాధానం ఇచ్చును. అప్పుడు అల్లాహ్! " ఫలాన నా దాసుడు అనారోగ్యముగా ఉన్నాడనే విషయం నీకు తెలియదా?. నీవు అతనిని ఎందుకు పరామర్శించలేదు?. ఒకవేళ నీవు అతనిని పరామర్శించినచో నేను అక్కడ ఉంటాననే విషయం నీకు తెలియదా?" అని ప్రశ్నించును. (మరల ఇలా ప్రశ్నించును.) ఓ ఆదమ్ సంతానామా! నేను నిన్ను అహారంను అడిగాను, కాని నీవు నాకు అహారమును ఇవ్వలేదు అని ప్రశ్నించును. అందుకు ఆదమ్ సంతానము " ఓ మా సంరక్షకుడా! మేము నీకు ఎలా అహారమును వడ్డించగలము? నిజానికి నీవే సకల లోకాలకు సంరక్షకుడవు కదా! " అని సమాధానం ఇచ్చును. అప్పుడు అల్లాహ్ ! " నీకు గుర్తుకు లేదా? ఫలాన నా దాసుడు నిన్ను అహారం అడిగాడు. కాని నీవు అతనికి అహారంను ఇవ్వలేదు. ఒకవేళ నీవు అతనికి అహారమును ఇచ్చినచో అందుకు ప్రతిఫలంను నీవు నా వద్ద పొందేవాడివి కదా! " అని గుర్తు చేయును. (మరల ఇలా ప్రశ్నించును.) ఓ ఆదమ్ సంతానమా! " నేను నిన్ను త్రాగటానికి మంచి నీటిని అడిగాను కాని, నీవు నాకు మంచినీటిని ఇవ్వలేదు " అని ప్రశ్నించును. అందుకు ఆదమ్ సంతానము ! " ఓ మా సంరక్షకుడా! నేను నీకు ఎలా మంచినీటిని త్రాగించగలను? నిజానికి నీవే సకల లోకాల సంరక్షకుడివి కదా! " అని సమాధానం ఇచ్చును. అప్పుడు అల్లాహ్ ! " ఫలాన నా దాసుడు నిన్ను మంచి నీళ్ళు అడిగాడు. కాని నీవు అతనికి మంచి నీళ్ళు ఇవ్వలేదు. ఒకవేళ నీవు అతనికి మంచి నీళ్ళు ఇచ్చినచో దాని ప్రతిఫలంను నీవు నా వద్ద పొందేవాడివి కదా!" అని తెలియజేయును. (ముస్లిం కితాబుల్ బిర్రు వస్సల్వాత్, బాబ్ ఫజీలు ఇయాదతు మ్మరీజ్, హదీఖతుస్వాలిహీన్ హదీస్ 583 )

## అల్లాహ్‌పై గల అభిమానంతో బీదవారికి, అనాథలకు, బంధీలకు భోజనం తినిపించేవారే నిజమైన విశ్వాసులు.

(ఉపదేశములు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం)

సయ్యదినా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: "రుచికరమైన ఆహార పదార్థాలనే భోజనం (తఆమ్) అని అంటారు. అంతేగాని చద్ది అన్నమును, కుళ్ళిన పదార్ధాలను భోజనం అనరు. మొత్తానికి ఒక పళ్ళెంలో అప్పుడే వండిన, వేడి వేడి , ఇష్టమైన ఆహార పదార్ధాలు వడ్డించి ఉన్నప్పుడు, ఇక భోజనం ప్రారంభించుదామని చూస్తున్నప్పుడు, యాచకుడి పిలుపు విని, అతనికి అట్టి భోజనాన్ని ఇచ్చినచో దానిని పుణ్యకార్యం అందురు. అంతేగాని అప్రయోజనమైన, నిరుపయోగమైన వాటిని దానం చేసి తాను పుణ్యకార్యం తలపెట్టానని ఏ వ్యక్తి ప్రకటన చేసు కోలేడు. పుణ్యకార్యపు ద్వారం చాలా ఇరుకుగా ఉంటుంది. కావున నిరుపయోగమైన వాటిని దానం చేయడం వలన ఎవరు కూడ అట్టి ద్వారము గుండా ప్రవేశించలేరనే విషయాన్ని బాగా గుర్తుంచుకోవాలి. (రిపోర్ట్ జల్సా సాలాన 1897, పేజి 79)

గుణగణాలను సరిచేసుకుంటూ, తమ స్థోమతకు అనుగుణముగా దానధర్మాలు చేయడం అలవర్చుకోవాలి.

యుత్ఇమూన త్తఆమ అలా హుబ్బిహీ మిస్కీనన్ వ్వయతీమన్ వ అసీర అనగా అల్లాహ్ ప్రీతి కొరకు బీదవారికి, అనాథలకు, బంధీలకు భోజనంను తినిపించుము. మేము ప్రత్యేకించి అల్లాహ్ తాలా ప్రీతి కొరకే తినిపించుతున్నాము మరియు అతి భయంకరమైన దినముకు భయపడుతున్నాము అని పలుకుదురు. (అల్ హకమ్, సంపుటి 5, సంచిక 27, దివి 24 జులై 1901, పేజి 2)

అల్లాహ్‌పై గల అభిమానంతో బీదవారికి, అనాథలకు, బంధీలకు భోజనం తినిపించేవారే నిజమైన విశ్వాసులు. (విశ్వాసులు) మేము కేవలం అల్లాహ్‌పై గల అభిమానంతో, అతని చల్లని చూపు కొరకు మాత్రమే మీకు తినిపించుతున్నాము. మేము మీ నుండి ఎలాంటి ప్రతిఫలమును, ఎలాంటి కృతజ్ఞతను ఆశించడం లేదు అని వారితో (బీద, అనాథ, బంధీలతో) అంటారు.

(సిరాజొద్దీన్ ఈసాయికే చార్ సవాలోంకే జవాబ్ పేజి 42) ( ఆధారం తఫ్సీర్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సంపుటి 3, తఫ్సీర్ సూరయే అద్దహర్, పేజి 281-282)

## ప్రతి వ్యక్తి యొక్క సంపదలో అతని బంధువుల, నిరుపేదల, బాటసారుల హక్కు ఉంటుంది.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు బలద్ అధ్యాయపు అవ్ ఇత్ఆమున్ ఫీ యౌమిన్ జీ మస్ఘబతిన్ ం యతీమన్ జా మఖ్రబతిన్ ం అవ్ మిస్కీనన్ జా మత్రబతిన్ ం అనే సూక్తిని విశ్లేషిస్తూ ఇలా పేర్కొన్నారు: ఒకవేళ (మానవుని) అతనిలో బీద, నిరుపేదల పట్ల నిజమైన అభిమానం ఉన్నచో అతడు వారి బాధలను దూరం చేయునట్టి నిజమైన భావనలను తనలో కల్గియుంటాడు. ఫలితముగా ఆకలిదప్పికల రోజున వారికి భోజనం తినిపించడాన్ని తన విధిగా భావిస్తాడు. అనగా కరువు కాటకాలలో వారి మంచిచెడులను చూస్తాడు లేదా ఆకలి దప్పికలతో అలమటిస్తున్నప్పుడు వారి కోసం ధాన్యాన్ని సమకూర్చుతాడు. వారు ఒక్కరోజులోనే వందలాది ఒంటెలను కోసి వండించేవారని మేము అంగీకరిస్తాము. కాని వారు అనవసర రోజులలో కోసి, వండించేవారని మేము అంటున్నాము. ఒకవేళ వాటిని కోసి, వండించాలనుకున్నచో అది బీద, నిరుపేదలు ఆకలితో ఉన్నప్పుడు వారి కోసం కోసి ఆ మాంసాన్ని వారిలో పంచి పెట్టేవారు. లేదా దగ్గరుండి వండించి, వారిని భోజనానికి ఆహ్వానించి వారికి తినిపించి, వారి ఆకలిని దూరం చేసేవారు. ఇదే సరైన సందర్భము. ఇచట ఫీ యౌమిన్ జీ మస్ఘబతిన్ అనే పదాలను ఈ వివేకతతోనే పొందుపర్చడం జరిగింది. వారు పేరు ప్రతిష్టల కొరకు, కీర్తించబడుటకు, పొగడబడుటకు తమ ధనమును ఖర్చుచేసేవారని ముందుగా ప్రస్తావించడం జరిగింది.

(10వ పేజిలో చదువుము)

### అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. **(అల్ హాందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక!

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం: لَا إِلٰهَ إِلَّا اللّٰهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰهِ

# న్యాయం లేనిచోట వినాశనం సంభవిస్తుంది. ముస్లిం సమాజం, ప్రపంచ శాంతి కోసం దుఆ.

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు తమ 6 మార్చి 2026 నాటి జుమా ప్రసంగంలో ఈరాన్ మరియు అమెరికాల మధ్య కొనసాగుతున్న యుద్ధం పట్ల ఆవేధన వ్యక్తపరుస్తూ, ప్రపంచంలో త్వరగా శాంతి స్థాపన జరగాలని ఆశిస్తూ కొన్ని సూచనలు చేశారు. హుజూర్ ఇలా పేర్కొన్నారు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తీసుకవచ్చిన సందేశం యొక్క ముఖ్యోద్దేశం ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను విశ్వసించడం, అతనిని ఆరాధించడం, అతని ఏకేశ్వర ఆరాధనను స్థిరపరుస్తూ, అందుకోసం ప్రయత్నించడం, అతని దాసుల హక్కులను చెల్లించుటకు ప్రయత్నించడం, ఆపై ఒకే సమాజీకులుగా మారి పరస్పరం సోదరభావంతో జీవించడం. కాని నేడు మన అందరం కలిమాను పఠించువారమనే వాగ్దానం చేసినప్పటికి కూడ మనం ఐక్యముగా ఉండలేక పోతున్నాము. మనం ఏ బోధనలను అనుసరిస్తున్నామని ప్రకటన చేస్తున్నామో అట్టి బోధనలకు అనుకూలముగా మన నడవడిక లేదు. ఫలితముగా మనం ఇస్లామీయ ప్రపంచ పరిస్థితులను చూసినచో చాలా బాధకరంగా కనిపిస్తున్నాయి. కొన్ని దేశాల వద్ద ప్రకృతి వనరులు, సంపద సమృద్ధిగా ఉన్నాయి. అయినా కూడ ప్రపంచం ముందు వాటికి ఎలాంటి ప్రాధాన్యతయే లేదు. ధార్మిక ప్రగతిలో కూడ వారు ఎలాంటి పాత్రను పోషించడం లేదు. ఇస్లామీయ బోధనలకు అనుగుణముగా జీవించడానికి వారు ఎలాంటి ప్రత్యేక ప్రయత్నాలు కూడ చేయడం లేదు. వాటి ఫలితాలు స్పష్టముగా కనిపిస్తున్నాయి. వారి ఇట్టి పరిస్థితుల నుండి ముస్లిమేతరులు లాభాలు పొందుతున్నారు.

ముస్లిం సమాజీకులం అయినందున మనం అందరం ఐక్యమత్యముగా ఉండుటకు ముస్లింలు అందరు ప్రయత్నించాలి. ఇందుకోసం మనం పూర్తి స్థాయిలో కృషి చేయాలి. ఇలా జరిగినప్పుడే మనం ప్రపంచ దాడుల నుండి సురక్షితముగా ఉండగలము. అప్పుడే మనం మన గౌరవాన్ని నిలబెట్టుకోగలము. ఇస్లామీయ వ్యతిరేక శక్తులు మనలో సృష్టిస్తున్న విభేదాల నుండి మనలను మనం కాపాడుకోగలము.

ఇందుకోసం అల్లాహ్ తాలా నేటి కాలంలో ఎలాంటి ఏర్పాట్లు చేశాడు అనే విషయాన్ని పరిశీలించాలి. అల్లాహ్ తాలా ఈ ఉద్దేశం కోరకు వాగ్దాత మసీహ్ మరియు వాగ్దాత మహ్దిని అవతరింపజేశాడు.

ప్రపంచ పరిస్థితుల దృష్ట్య నేను చాలా కాలం నుండి తెల్పుచున్న విషయం ఏమిటనగా, యూరోపియన్ దేశాల కారణంగా ప్రపంచ పరిస్థితులు దిగజారి పోతుంటాయి. కాని ఇస్లామీయ దేశాలు కూడ ఈ విపత్తులో తమ వంతు భాగాన్ని పంచుకుంటున్నాయి.

పశ్చిమ దేశనాయకులు ముందుగా ముస్లిం దేశాలను పరస్పరం పోరాడుకునేలా చేశారు. ఆ తరువాత నేడు వారి వనరులను, సంపదను ఆక్రమించుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈ దుష్ట దేశాలు ఎన్నడు కూడ ముస్లిం దేశాలు పరస్పరం కలిసి మెలసి ఐక్యముగా ఉండడాన్ని జీర్ణించుకోలేవని, ముస్లిం దేశాల మధ్య వివాధాలను సృష్టించడమే వారి ప్రధాన ఎజెండా అనే విషయాన్ని ముస్లింలు త్వరగా అర్థం చేసుకోవాలి.

నేడు దుఆలు చేస్తూ అల్లాహ్ ఆస్థానంలో మోకరల్లిడం మన ప్రథమ కర్తవ్యం. ముస్లిం దేశాల కోసం చాలా ఎక్కువగా దుఆలు చేయాలి.

అమెరికా అనేక ముస్లిం దేశాలలో తమ సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకున్నది. కాని ఎందుకు?. ఆయా దేశాలను రక్షించడానికా?. చివరికి ఆయా అరబ్ దేశాలకు ఎవరి నుండి ఆపద పోంచి ఉన్నది?. ఆయా అగ్రరాజ్యాలే స్వయముగా ఆపదలను సృష్టిస్తున్నాయి. ఆపై మీకు ఫలాన ఆపద పోంచి ఉన్నది, కావున మీ కొరకు మేము ఈ రక్షణ చర్యలు తీసుకుంటున్నాము అని ముస్లిం దేశాలను నమ్మిస్తున్నాయి. వాస్తవానికి ముస్లిం దేశాలకు ఏయే ముస్లిమేతర దేశాల నుండి నిజమైన ఆపద ఉన్నదో ఆయా దేశాలకు వ్యతిరేకముగా ఈ సైనిక స్థావరాలు ఏ మాత్రం ఉపయోగించబడవు.

ఆయా అగ్రదేశాలకు ఈరాన్ అంటేనే కంటిమీద కునుకు లేకుండా ఉన్నది. ఒకవైపు ఈరాన్ విధానాలు ఇజ్రాయిల్‌కు వ్యతిరేకముగా చాలా కఠినముగా ఉన్నాయి. మరోవైపు ముస్లిం దేశాలతో సిద్ధాంత పరమైన విభేదాలు ఉన్నాయి. అందువలన ఈ అగ్రరాజ్యాలు వాటిని ఆసరాగా చేసుకోని, వాటి నుండి ప్రయోజనాలు పొందుతూ ఆ ప్రాంతంలో తమ నిలకడ తప్పనిసరి అనే నమ్మకాన్ని కల్పించసాగాయి. నిజానికి ఆయా స్థావరాల కారణంగానే అరబ్ దేశాలు ఆపదలో ఉన్నాయి. దాడులు జరుగుతున్నాయి. ఆయా దాడుల వలన అరబ్ దేశాల ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటున్నది. ఈ పరిస్థితుల వలన లాభం ఆయా అగ్రరాజ్యాలకే దక్కుతుంది. ఇక ముందు కూడ లభిస్తూ ఉంటుంది.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మాహుల్లాహ్ గారు ఇరాక్ యుద్ధ సమయంలోనే " ఈ విపత్తు ఇంకా పెరుగుతూ పోతుంది " అని తెలిపారు. బహుశా ముస్లిం దేశాలు ఆ యుద్ధంతో గుణపాఠం నేర్చుకున్నచో బాగుండేది!.

నేటి ఈ ఆశాంతిని ఆయా అగ్రరాజ్యాలే వ్యాపింపజేస్తున్నాయి. ఏదేని దైవ మహత్యం ప్రత్యేకముగా జరిగితే తప్ప, బాహ్యముగా చూసినచో దీనిని అరికట్టడం అసాధ్యముగానే అనిపిస్తుంది. ఇందుకోసం కూడ వారు తప్పకుండా ప్రయత్నించవలసి ఉంది, మనం కూడ దుఆలు చేయవలసి ఉన్నది.

రోజు రోజుకు పెరిగిపోతున్న ఈ దౌర్జన్యమును చూసినచో చాలా విశృత స్థాయిలో మూడవ ప్రపంచ యుద్ధం జరిగే పరిణాలు కనిపిస్తున్నాయి. నిజానికి కొంత మంది పాశ్చాత్య దేశాల విశ్లేషకులకు మూడవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనది అని తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు. నేను కూడ ప్రారంభమైనది అనే తెల్పుచున్నాను. కాని ఇప్పటికైన ముస్లిం దేశాలు విజ్ఞతతో వ్యవహరించినచో నేడు అయినా వారు ఆ దుర్మార్గుల చెంత నుండి బయటపడగలరు.

మధ్య ఆసియాలో యుద్ధం జరుగుతుంది. అమెరికా ఈరాన్‌పై దాడి చేసింది. కాని ఈరాన్ ముందు నుండే హెచ్చరిస్తూ వచ్చింది. ఒకవేళ మీరు మాపై దాడి చేసినచో మేము అరబ్ దేశాలలో ఉన్నటు వంటి మీ స్థావరాలపై దాడి చేస్తాము అని హెచ్చిరించింది. అలాగే జరిగింది. వీరు అధికారాన్ని మారుస్తాము అని పిలుపునిచ్చారు. కాని ఏమైంది?. ఖామిని సాహెబ్ గారికి అమరుడనే బిరుధు లభించింది. వారి గౌరవం ఇంకా పెరిగిపోయింది. వారి కుటుంబం మొత్తాన్ని హతమార్చినారు. దాని వలన అధికారం మారడం అనే విషయాన్ని ప్రక్కన పెట్టినచో, గతంలో కంటే ఎక్కువగా ఈరానీయులు ఏకమైయ్యారు.

మధ్య ఆసియాలో ఉన్నటు వంటి అరబ్ దేశాలకు ప్రతిదాడులు చేయు సామార్థ్యం లేదు. వారు పూర్తిగా పాశ్చాత్య దేశాలపై ఆధారపడి ఉన్నారు. ఈ యుద్ధం నేడు భయంకర రూపాన్ని దాల్చుకున్నది.

అరబ్ దేశాలకు ఒక వైపు వారి ఇంధన బావులు మూసివేయబడడం వలన, ధరల పెరుగుదల వలన నష్టం జరుగుతుండగా, మరోవైపు ఈ యుద్ధంలో అమెరికా నుండి ప్రతిదాడులను ఆశించడం వలన వారి ఖర్చును భరించవలసి ఉంటుంది. వీటన్నింటి వలన అరబ్ దేశాల ఆర్థిక పరిస్థితి తీవ్రముగా నష్టపోతుంది.

అమెరికా అధ్యక్షుడు గత అమెరికన్ ప్రభుత్వాలు రూపొందించిన ఫాలసీలనే అమలు చేస్తున్నాడు. ఇది వారి నేటి ఫాలసీ కాదు. అతి పూరతనమైన ఫాలసీ. వారికి నచ్చిన ప్రతీ ప్రాంతపు వనరులను ఆక్రమించుకుంటారు. అందుకు ఏదైన సాకును చూపుతుంటారు. ఫలాన కారణం, ఫలాన కారణం అని వినిపిస్తుంటారు. వారితో జత కట్టని దేశాలను భయభ్రాంతులకు గురి చేస్తారు, లేదా నాశనం చేస్తారు.

న్యాయం జరుగని చోట వినాశనమే జరుగుతుంది. ఆ అగ్రరాజ్యాలు వందలాది మంది పిల్లలను, అమయాకులను చంపివేశారు. పిల్లల పాఠశాలలపై బాంబు వేస్తున్నారు ఇదేక్కడి యుద్ధం. ఎవరు అడిగేవారు లేరు.

ఇస్లాం దైవ ఏకత్వంను స్థాపించుటకు వచ్చింది. ఈ లక్ష్యం కొరకే ముస్లిం దేశాలు ప్రయత్నించవలెను. ఇందుకోసం ఏకం వలెను. అంతేగాని ఈ అగ్రరాజ్యాలను తమ దైవంగా భావించకూడదు. లేనిచో ఈ అగ్రరాజ్యాలు నెమ్మది నెమ్మదిగా ఒక్కొక్క ముస్లిం దేశంపై దాడిచేసిఆయా దేశాల వనరులను ఆక్రమించుకుంటాయి.

ఒకవేళ విశ్వాసులకు చెందిన రెండు వర్గాలు పరస్పరం పోరాడుచున్నచో వారిలో సంధి కుదర్చండి, ఒకవేళ సంధి ఏర్పడిన తరువాత ఎవరైన ఇతరులపై దాడి చేసినచో, దాడి చేసిన వారు తిరిగి అల్లాహ్ ఆదేశాన్ని పాటించే వరకు వారికి వ్యతిరేకముగా అందరు కలిసి పోరాడండి. ఒకవేళ వారు అల్లాహ్ ఆదేశాన్ని పాటించుటకు సిద్ధమైనచో పోరాడేవారి మధ్య న్యాయబద్ధముగా సంధిని కుదర్చండి అని ఖుర్‌ఆన్ ఎంతో స్పష్టముగా బోధిస్తుంది.

ప్రపంచ శాంతి కోసం ఈ బోధన చాలా ముఖ్యం. ముసల్మానుల కొరకు ఈ ఆదేశం చాలా ప్రాధాన్యతను కల్గియున్నది. ఎందుకనగా అల్లాహ్ తాలా ఖుర్‌ఆన్ కరీంలో ఈ విధముగా ఆదేశించాడు. సంధిని కుదుర్చునప్పుడు తమ వ్యక్తి గత ప్రయోజనాలను చూసుకోవద్దు. కేవలం అసలు సమస్యకు మాత్రమే పరిష్కారమును చూపవలెను. పాకిస్తాన్ మరియు ఇతర దేశాలు చైనా వంటివి శాంతి కొరకు ప్రయత్నిస్తున్నాయి. ఈరాన్‌తో పాటు ఆయా అరబ్ దేశాలు కూడ శాంతిని నెలకొల్పుటకు శ్రద్ధ వహించవలెను.

దుఆలు చేయడమే మన ప్రథమ కర్తవ్యం. రమజాన్ మాసంలో కేవలం తమ వ్యక్తిగత అవసరాల కోసమే దుఆలు చేయకుండా, ముస్లిం సమాజ శ్రేయస్సు కొరకు, ప్రపంచ శాంతి కొరకు కూడ దుఆలు చేస్తూండాలి.

**నూరుల్ ఇస్లాం శాఖ:**
**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**
**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**
**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

# జుమా ప్రసంగము

**దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి జీవితంలోని ఈ అంశానికి సంబంధించి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పట్ల ఉన్న ప్రేమ కూడా వ్యక్తమవుతుంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌ను ప్రేమించడమే కాదు, అల్లాహ్ కూడా ప్రవక్తను ప్రేమించాడు. అంతేకాకుండా, అల్లాహ్ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పట్ల తన ప్రేమను వ్యక్తపరిచిన తరువాత, వారికి మార్గదర్శకత్వం కూడా వహించారు.**

---

**"పవిత్ర ఖురాన్ యొక్క భావప్రసార పద్ధతులలో నిష్ణాతులైన ఎవరైనా, కొన్నిసార్లు అత్యంత దయగలవాడు మరియు కరుణామయుడు, సర్వోన్నతుడైన ఆయన అల్లాహ్, తాను ఎంచుకున్న సేవకుల కోసం పైకి అప్రియంగా కనిపించే పదాలను ఉపయోగిస్తాడని గుర్తించకుండా ఉండలేరు, కానీ వాటి అర్థంలో అవి అత్యంత ప్రశంసనీయమైనవి మరియు అభినందనీయమైనవిగా ఉంటాయి"**

---

**నమాజ్ తరువాత నేను రెండు పరోక్ష జనాజ నమాజ్‌లను చదివించుతాను. మొదటిది మౌలానా జలాలుద్దీన్ నయ్యర్ సాహిబ్. అతను మాజీ సదర్ సదర్ అంజుమన్ అహ్మదియా మరియు సదర్ మజ్లిస్ తహ్‌రీక్-ఎ-జాదిద్ ఖాదియన్ గారిది. ఆయన ఇటీవల మరణించారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.**

---

**రెండవ ప్రస్తావన మీర్ ముష్తాఖ్ అహ్మద్ సాహిబ్ గారి కుమారుడైన గౌరవనీయ మీర్ హబీబ్ అహ్మద్ సాహిబ్ గారిది. ఆయన ఇటీవల 79 సంవత్సరాల వయస్సులో కన్నుమూశారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 26 డిసంబర్ 2025, (26 ఫతహ్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُولُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ - اَلرَّحْمٰنِ الرَّحِيْمِ - مٰلِكِ يَوْمِ الدِّيْنِ -

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ - اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ -

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ -

గత ప్రసంగంలో, నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి జీవితంలోని కొన్ని అంశాలను ప్రస్తావించాను. ఈ రోజు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల వారికున్న ప్రేమకు సంబంధించి వారి జీవితంలోని కొన్ని అంశాలను చర్చిస్తాను. ఈ అంశాలలో కొన్ని గతంలోనే క్లుప్తంగా చర్చించబడి ఉండవచ్చు. అయితే, వాటిలో కొన్నింటిని ఈ రోజు వివరంగా చర్చిస్తాము.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి జీవితంలోని ఈ అంశానికి సంబంధించి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పట్ల ఉన్న ప్రేమ కూడా వ్యక్తమవుతుంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌ను ప్రేమించడమే కాదు, అల్లాహ్ కూడా ప్రవక్తను ప్రేమించాడు. అంతేకాకుండా, అల్లాహ్ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పట్ల తన ప్రేమను వ్యక్తపరిచిన తరువాత, వారికి మార్గదర్శకత్వం కూడా వహించారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ ప్రేమలో ఎలా వృద్ధి చెందారో మరియు తన ఉమ్మత్ (జాతి) యొక్క నైతిక శిక్షణ మరియు మార్గదర్శకత్వాన్ని ఎలా నిర్ధారించారో మనం చూస్తాము.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తనకు అవతరింపజేసిన బోధనలను, తన ఉమ్మత్‌కు మార్గనిర్దేశం చేసే విధంగా వారు (స) ఎలా తెలియజేశారో మనం గమనించవచ్చును. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హృదయం దీని కోసం తీవ్రమైన వేదనతో, తపనతో నిండి ఉండేది. వాస్తవానికి, ఈ వేదన కారణంగానే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయంగా వారికి మార్గనిర్దేశం చేశారు, ఎందుకంటే వారు ఉమ్మత్‌కు మార్గనిర్దేశం చేయవలసి ఉంది. మరో మాటలో చెప్పాలంటే, ఒకవైపు వారి హృదయం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రేమ కోసం వేదనతో నిండి ఉంటే, మరోవైపు అది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రాణుల కోసం బాధతో, తపనతో మరియు వారిని వినాశనం నుండి రక్షించాలనే ఆకాంక్షతో నిండి ఉండేది.

పవిత్ర ఖురాన్‌లోని సూరా అజ్జుహాలో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

వవజదక జ్వాల్లన్ ఫహదా (జ్జుహా:8)

"నీ ప్రజల గురించి చింతిస్తూ నీవు దిక్కుతోచని స్థితిలో తిరుగుతుండగా ఆయన నిన్ను చూసి, వారి సంస్కరణ కొరకు సరైన పద్ధతులను నీకు బోధించాడు." అంతేకాకుండా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల వారికున్న ప్రేమకు సంబంధించి, ఈ సూక్తి యొక్క అనువాదం ఈ క్రింది విధంగా ఉంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "మా ప్రేమను వెతుకుతూ, తీవ్ర వేదనతో నీవు దిక్కుతోచని స్థితిలో తిరుగుతుండగా మేము నిన్ను చూశాము, అందుకని మేము నిన్ను ఆ మా మార్గం వైపు నడిపించాము, దాని ద్వారా నీవు మమ్మల్ని చేరుకున్నావు."

ఇమామ్ రజీ గారి తఫ్సీర్-ఎ-కబీర్‌లో, సూరా అద్-దుహాలోని ఈ సూక్తి అనగా వవజద్‌క జ్వాల్లన్ ఫహదా యొక్క వ్యాఖ్యానం క్రింద ఈ క్రింది విధంగా వ్రాయబడింది:

"'జ్వాలాల్' అనే పదానికి ఒక అర్థం ప్రేమ అని గలదు. దీనిని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇన్నక లఫీ జ్వాలాలికల్ ఖదీమ్ లో ఇలా పేర్కొన్నాడు.

"ఇక్కడ 'జ్వలాల్ అనే పదానికి అర్థం ప్రేమ. కాబట్టి, దీని అర్థం ఏమిటంటే, మీరు ఒక ప్రియమైనవారు. అందువల్ల, మీ ప్రియమైనవారికి సేవ చేయడం ద్వారా అల్లాహ్ సామీప్యాన్ని పొందడానికి మిమ్మల్ని శక్తినిచ్చే మార్గాల వైపు నేను మీకు మార్గదర్శనం చేశాను."

**(మఫాతిహ్-ఉల్-ఘైబ్,తఫ్సీరుల్-కబీర్, సంపుటి 16, తఫ్సీర్ సూరహ్ అజ్జుహా, సంపుటి 7, దారుల్ కుతుబుల్-ఇల్మియా, బీరుత్, 2004, పుట 197)**

దీని ద్వారా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్, దైవ ప్రవక్త (స) తన ప్రేమలో పూర్తిగా లీనమై ఉన్నారని సాక్ష్యమిచ్చారు.

ఈ ప్రేమ వ్యక్తీకరణను మనం వివిధ కథనాలలో చూడవచ్చును. సర్వోన్నతుడైన అల్లాహ్‌కు దైవ ప్రవక్త (స)పై ప్రేమ ఉన్నది మరియు ప్రవక్త (స)కు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌పై ప్రేమ ఉన్నది. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇలా పేర్కొన్నారు: "పవిత్ర ఖురాన్ యొక్క భావప్రసార పద్ధతులలో నిష్ణాతులైన ఎవరైనా, కొన్నిసార్లు అత్యంత దయగలవాడు మరియు కరుణామయుడు, సర్వోన్నతుడైన ఆయన అల్లాహ్, తాను ఎంచుకున్న సేవకుల కోసం పైకి అప్రియంగా కనిపించే పదాలను ఉపయోగిస్తాడని గుర్తించకుండా ఉండలేరు, కానీ వాటి అర్థంలో అవి అత్యంత ప్రశంసనీయమైనవి మరియు అభినందనీయమైనవిగా ఉంటాయి" బాహ్యముగా, మనం ఆ పదం యొక్క సాధారణ వాడుకను చూస్తే, అది సరైన పదం కాదని అనిపిస్తుంది, ఎందుకంటే 'జ్వాల్' అనే పదానికి మార్గభ్రష్టత్వం అని అర్థం. అయితే, అది నిజం కాదు. కాని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఒక ప్రత్యేక సందర్భంలో తాను ఎంచుకున్న దాసుల కోసం దీనిని ఉపయోగించినప్పుడు, ఆ పదం యొక్క అర్థం మారుతుంది. ఉదాహరణకు, అల్లాహ్, తాలాయే తన మహిమగల, గౌరవనీయ ప్రవక్త గురించి ఇలా సెలవిచ్చాడు: వవజదక జ్వాల్లన్ ఫహదా (జ్జుహా:8) అనగా ఆయన నిన్ను తన అన్వేషణలో సంచరిస్తూ కనుగొని, తన వద్దకే మార్గదర్శనం చేసాడు.

ఇక్కడ స్పష్టంగా, భాషావేత్తలు కూడా ఉదహరించడానికి ఇష్టపడే 'జ్వాల్' అనే పదానికి బాగా తెలిసిన మరియు సుపరిచితమైన అర్థం 'మార్గభ్రష్టుడు'. ఈ అవగాహన ప్రకారం, ఆ సూక్తి యొక్క అర్థం, '(ఓ అల్లాహ్ ప్రవక్తా!) సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మిమ్మల్ని మార్గభ్రష్టులుగా చూసి, మీకు సరైన మార్గాన్ని చూపించాడు' (సాధారణ ప్రజలు దీనిని ఈ విధంగా అనువదిస్తారు), అయితే వాస్తవం ఏమిటంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎన్నడూ మార్గభ్రష్టులు కాలేదు. ఒక వ్యక్తి తనను తాను ముస్లిం అని చెప్పుకుంటూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన జీవితంలో ఒక సమయంలోనైనా మార్గభ్రష్టత్వానికి పాల్పడ్డారని విశ్వసించేవారు కాఫిర్ (అవిశ్వాసి), అధర్మికుడు మరియు ఇస్లామీయ చట్టం

ప్రకారం శిక్షకు అర్హుడు. కావున ఇక్కడ ఈ సూక్తి సందర్భానికి తగిన అర్థాన్ని ఇవ్వాలి, అది ఈ క్రింది విధంగా ఉంది: అల్లాహ్‌తాలా తన మహిమగల దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి మొదట ఇలా పేర్కొన్నాడు: అలం యజిద్క యతీమన్ ఫావా ం వవజదక జ్వాల్లన్ ఫహదా ం వవజదక ఆయిలన్ ఫఅఘ్నా (జుహా :7-9) "అర్థం ఏమిటంటే: సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నిన్ను అనాథగా, నిస్సహాయుడిగా చూశాడు, మరియు ఆయన తన వద్ద నీకు ఆశ్రయం కల్పించాడు మరియు నిన్ను 'జ్వాల్' (అంటే అల్లాహ్ తేజస్సుతో గాఢంగా ప్రేమలో ఉన్నవాడి)గా కనుగొన్నాడు, అందువల్ల ఆయన నిన్ను తన వైపుకు ఆకర్షించుకున్నాడు మరియు నిన్ను నిరుపేదగా చూసి సంపన్నుడిని చేశాడు.'

(ఆయినాయే కమలాతే ఇస్లాం, రూహానీ ఖజాయిన్, సంపుటి 5, పుటలు 170-171 )

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ఆత్మ యొక్క స్వచ్ఛత, మనస్సు యొక్క విశాలత, పవిత్రత, వినయం, నిష్కపటత్వం, విశ్వాసం, విశ్వసనీయత మరియు దైవ ప్రేమ విషయాలలో ఇతర ప్రవక్తలందరి కంటే ఉన్నతంగా ఉన్నందున, మహిమాన్వితుడైన అల్లాహ్, ఇతర ప్రవక్తలను మించిన విశేషమైన శ్రేష్ఠత అనే పరిమళంతో వారికి అభిషేకం చేసాడు." వారి చాతి మరియు హృదయం వారి ముందు గతించిన వారికీ, వారి తర్వాత రాబోయే వారి కంటే ఎక్కువ విశాలమైన, పవిత్రమైన, నిష్కల్మషమైన, ప్రకాశవంతమైన మరియు ప్రేమమయంతో నిండియున్నవి. ఈ కారణం చేతనే వారికి ముందు ఉన్నవారందరికీ మరియు వారి తర్వాత రాబోయే వారందరికీ అనుగ్రహించబడిన దైవవాణి కన్నా బలమైన, పరిపూర్ణమైన, ఉన్నతమైన మరియు సంపూర్ణమైన దైవవాణి వారిపై అవతరించడానికి యోగ్యమైనదిగా పరిగణించబడింది. అనగా చాలా పటిష్టమైన, సంపూర్ణమైన దైవవాణి. చాలా ఉన్నతమైనది, వైభవమైనది. చాలా గొప్పది, పరిపూర్ణత గలది. అది దైవ గుణాలను ప్రతిబింబించే స్పష్టమైన, విశాలమైన మరియు పెద్ద అద్దంలా పనిచేయాలి. ఈ అద్దంలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క గుణాలను చూడవచ్చును. అదే విధముగా అల్లాహ్ తాలా యొక్క ప్రతి అంశాన్ని మనం ఆ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితంలో మరియు వారు తెచ్చిన బోధనలలో కూడా చూడవచ్చును.

మరల ఇలా పేర్కొన్నారు:

"అందుకే పవిత్ర ఖురాన్ అటువంటి ఉన్నతమైన శ్రేష్ఠతలను కలిగి ఉంది, దాని తీవ్రమైన మరియు ప్రకాశవంతమైన కిరణాల ముందు మునుపటి పుస్తకాలన్నింటి కాంతి మసకబారుతుంది." (అంటే, మునుపటి గ్రంథాల యొక్క తేజస్సు మరియు గొప్పతనం అంతా దీని ముందు ఏమాత్రం విలువలేనిది.) ఇందులో లేని సత్యాన్ని ఏ మనసూ ప్రతిపాదించలేదు (ప్రతీదీ పవిత్ర ఖురాన్‌లోనే ఉంది). పవిత్ర ఖురాన్‌లో ఇప్పటికే ప్రస్తావించబడనిది ఏ వ్యక్తి సృష్టించగల లేదా కల్పించగల విషయం ఏదీ లేదు. నిశ్చయంగా, దానిని అర్థం చేసుకోవాలి. మరియు ఇందులో ఇప్పటికే ప్రస్తావించబడని వాదనను ఏ తర్కమూ ప్రతిపాదించలేదు. ఇది లక్షలాది హృదయాలపై బలమైన మరియు ఆశీర్వాదకరముగా ప్రభావం చూపినట్లుగా, మరే వాక్కు కూడా హృదయాలను అంత శక్తివంతంగా ప్రభావితం చేయలేదు. నిస్సందేహంగా, ఇది దైవం యొక్క పరిపూర్ణ గుణాలను ప్రతిబింబించే ఒక స్పష్టమైన అద్దం, దీనిలో ఒక సాధకుడు అత్యున్నత స్థాయి అవగాహనను పొందడానికి అవసరమైనదంతా లభిస్తుంది."

(సుర్మా చష్మాయే ఆర్య, రూహానీ ఖజాయిన్, సంపుటి 2, పుటలు 71-72, అనుబంధం)

ఈ విధంగా, దైవ ప్రవక్త (స.అ.స)పై అవతరింపజేయబడిన బోధన కూడ స్వయంగా ఎంత పవిత్రమైనది. మరియు సమస్త వస్తువుల కంటే, సమస్త బోధనల కంటే ఉన్నతమైనది. మరియు సమస్త గ్రంథాల కంటే అత్యున్నత స్థానంలో నిలిచింది. పవిత్ర ఖుర్ఆన్ ఒక సంపూర్ణమైన మరియు పరిపూర్ణమైన బోధనను కలిగి ఉంది. కాబట్టి, దైవ ప్రవక్త (స.అ.స) అస్తిత్వం ఆ బోధనకు ఒక ప్రతి రూపం; అంటే, వారి అస్తిత్వం కూడా సంపూర్ణమైనది మరియు పరిపూర్ణమైనది. ఈ విషయాన్ని వారే స్వయంగా నిరూపించి చూపారు. వారిపై అవతరింపజేయబడిన గ్రంథం సరిగ్గా ఈ కారణం చేతనే అవతరింపజేయబడింది: వారి అస్తిత్వం సమస్త మానవుల కంటే అత్యంత పరిపూర్ణమైనది, మరియు ఎవరూ చేరుకోలేని అత్యున్నత స్థాయికి చేరుకున్న పరిపూర్ణ మానవుడు కేవలం వారు ఒక్కరే. నిశ్చయంగా దైవ ప్రవక్త (స.అ.స) ఒక ఉత్తమ ఆదర్శవంతుడు, కాబట్టి, మీరు వారిని అనుసరించేలా కృషి చేయండి అని సర్వశక్తిమంతుడు అయినా అల్లాహ్ తెలిపాడు. ఈ కారణంగానే, దైవ ప్రవక్త (స.అ.స) ద్వారా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా ప్రకటింపజేశాడు. ఖుల్ ఇన్‌కున్‌తుమ్ తుహిబ్బునల్లాహ ఫత్తబిఊని యుహ్‌బిబ్‌కుముల్లాహు వయఘ్‌ఫిర్‌లకుం జునూబకుం వల్లాహు ఘఫూరుర్రహీం. అనగా "ఇలా పలకండి: 'మీరు అల్లాహ్‌ను ప్రేమిస్తున్నట్లయితే, నన్ను అనుసరించండి; అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు మరియు మీ దోషాలను క్షమిస్తాడు.'" మరియు అల్లాహ్ చాలా క్షమించేవాడు, దయగలవాడు." (ఆలే ఇమ్రాన్: 32)అందువల్ల, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రేమను పొందే మార్గాలను కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ఉత్తమ ఆదర్శం నుండి మాత్రమే నేర్చుకోవాలి.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల వారికున్న ప్రేమ యొక్క వ్యక్తీకరణలను మనం చూస్తూనే ఉన్నాము. అవి హదీసులో నమోదు చేయబడ్డాయి;

దైవ ప్రవక్త (స) తన దేవుని ప్రేమ కోసం ఆరాటపడుతూ ఈ క్రింది విధముగా దుఆను చేసేవారు.

اَللّٰھُمَّ إِنِّیٓ أَسْأَلُكَ حُبَّكَ، وَحُبَّ مَنْ یُّحِبُّكَ، وَالْعَمَلَ الَّذِیْ یُبَلِّغُنِیْ حُبَّكَ، اَللّٰھُمَّ اجْعَلْ حُبَّكَ أَحَبَّ إِلَیَّ مِنْ نَفْسِیْ وَأَھْلِیْ وَمِنَ الْمَاءِ الْبَارِدِ۔

(جامع ترمذی کتاب الدعوات باب دعاء داود: اللّٰھم انی اسألك حبك و حب من یحبك۔ حدیث 3490)

"ఓ అల్లాహ్, నిశ్చయంగా నేను నిన్ను ప్రేమిస్తున్నాను మరియు నిన్ను ప్రేమించే వారి ప్రేమ కోసం మరియు నీ ప్రేమను పొందేలా చేసే చర్య కోసం నేను నిన్ను అడుగుతున్నాను, ఓ అల్లాహ్, నా కంటే, నా కుటుంబం మరియు చల్లని నీటి కంటే మీ ప్రేమను నాకు మరింత ప్రియమైనదిగా చేయండి." (జామిఅత్-తిర్మిజి, కితాబ్ అద్-దావత్, హదీస్ 3490)

అందువల్ల, నేడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పట్ల ప్రేమ ఉందని చెప్పుకునే ప్రతి వ్యక్తి, మరియు తాను కూడా సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు ప్రియమైనవాడు కావాలని, మరియు అల్లాహ్ తనపై తన అనుగ్రహాన్ని కురిపించాలని కోరుకునే ప్రతి వ్యక్తి పఠించవలసిన దుఆ ఇది.

అదేవిధంగా, ఒక హదీసులో హజ్రత్ అబ్దుల్లా బిన్ యజీద్ ఖత్మీ అన్సరీ రజివిలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రార్థించే వారు:

"ఓ అల్లాహ్, నాకు నీ ప్రేమను ప్రసాదించు, మరియు నీ సన్నిధిలో ఎవరి ప్రేమ నాకు ప్రయోజనం చేకూరుస్తుందో ఆ వ్యక్తి యొక్క ప్రేమను కూడా నాకు ప్రసాదించు. ఓ అల్లాహ్, నీవు నాకు ఏ ప్రియమైన వస్తువులను ప్రసాదిస్తావో, అవి నీ ప్రేమను పొందడంలో నాకు బలమైన సాధనంగా మలుచుము. మరియు నీవు నా నుండి ఏ ప్రియమైన వస్తువులను దూరం చేస్తావో, అవి కూడ నీ ప్రేమను పొందడంలో నాకు బలమైన సాధనముగా మలుచుము. "

(జామిఅత్-తిర్మిజి, కితాబ్ అద్-దావత్, హదీస్ 3491)

మొత్తానికి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రార్థించేవారు: "నీవు నాకు ఏ ప్రియమైన వస్తువులను ప్రసాదిస్తావో, అవి నీకు ప్రియమైన వాటిని సాధించే ప్రయత్నంలో నాకు బలాన్నిచ్చే సాధనంగా ఉండాలి; నేను ఆ వస్తువులను మరింతగా సంపాదించుకునే కొద్దీ, నీకు ప్రియమైనవాడిగా మారేలా, వాటి ద్వారా నీ ప్రేమను మరింతగా పొంది, నీకు ఇష్టమైన వాటిని సంపాదించేలా నాకు మరింత బలాన్ని ప్రసాదించు." మరల ఇలా ప్రార్థించారు: "నా వద్ద ఉన్న ఏ ప్రియమైన వస్తువులనైనా అంటే, నేను లేదా నా ప్రియమైనవారు ప్రియమైనవిగా భావించే వాటిని నీవు నా నుండి వేరు చేసినప్పుడు, అవి నీకు ప్రియమైన విషయాలను సాధించే ప్రయత్నంలో నాకు బలాన్నిచ్చే సాధనంగా ఉండాలి. నా నుండి దూరం చేయబడిన ఆ వస్తువులు నిరాశకు కారణం కాకుండా చూడు; దానికి బదులుగా, అల్లాహ్ వాటిని ఇష్టపడక నా నుండి వేరు చేసినందువల్ల గానీ, లేదా ఇది అల్లాహ్ సంకల్పం మరియు ఇష్టం అయినందువల్ల గానీ, ఆ తర్వాత నేను నూతన బలాన్ని పొందేలా చేయిము, అప్పుడు అల్లాహ్ ప్రేమించే వస్తువులు నాకు ప్రసాదించబడాలి." ఓ అల్లాహ్! నీకు ఇష్టం లేని వాటిని నా నుండి దూరం చేసినప్పుడు నీకు ప్రియమైన మరియు నీకు ప్రీతికరమైన వాటిని పొందే శక్తిని నాకు ప్రసాదించు.

ఇది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల ప్రవక్త (స)కు ఉన్న ప్రేమ వ్యక్తీకరణ.

అదేవిధంగా, హజ్రత్ ఆయిషా రజియల్లాహ్‌తాలా అన్‌హా గారు ఈ విధముగా తెలిపారు. ఇజా జాఅ నస్‌రుల్లాహి వల్ ఫత్‌హు యొక్క అవతరణ తర్వాత, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సుబ్‌హానక రబ్బనా వబి హమ్‌దిక అల్లాహుమ్మగ్‌ఫిర్‌లి అనగా "మా ప్రభువా!, నీవు పవిత్రుడవు మరియు నీ స్తుతిపరుడవు. ఓ అల్లాహ్!, నన్ను క్షమించు." అని దుఆ చేయకుండా ఏ నమాజ్ కూడా చేసేవారు కాదు.

(సహీ-బుఖారీ, కితాబ్ తఫ్సీర్, హదీస్ 4967)

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల ప్రేమను ప్రదర్శించే ఒక సంఘటనను హజ్రత్ ఆయిషా రజియల్లాహ్‌తాలా అన్‌హా గారు ఈ క్రింది మాటలలో వివరించారు:

"నేను ఒక రాత్రి సమయంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పక్కన నిద్రిస్తున్నాను. కాని ఆ రాత్రి వారు నాకు అక్కడ కనిపించలేదు. ఆ రాత్రి చీకటిలో, నేను వారి కోసం తడుముకుంటూ వెతకగా, నా చేయి వారి పాదాలను తాకింది. వారు సజ్దాలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను ఇలా ప్రార్థిస్తున్నారు:

"నీ ఆగ్రహానికి గురికాకుండా నీ అనుగ్రహాన్ని నేను ఆశ్రయిస్తున్నాను, మరియు నీ శిక్షకు గురికాకుండా నీ క్షమాపణను నేను ఆశ్రయిస్తున్నాను. నీ స్తోత్రాలను నేను లెక్కించలేను; నీవు నిన్ను నీవే స్తుతించుకున్నావు."

(సహీముస్లిం, కితాబుస్సలాత్, హదీస్ 743)

అంటే, నీవే నీ గురించి ప్రస్తావించిన స్తోత్రంవలే నేను నీ ఉన్నత హోదాకు తగిన రీతిలో నిన్ను స్తుతించలేను. నీ నిజమైన స్తుతి అదే.

అదేవిధంగా, మరోచోట హజ్రత్ ఆయిషా రజియల్లాహ్ తాలా అన్‌హా ఇలా పేర్కొన్నారు: ఒక రాత్రి, నా ఇంట్లో బస చేసే వంతు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి వచ్చింది. నేను నిద్రపోయాను, వారు మాత్రం నిశ్శబ్దంగా బయటకు వెళ్లారు. బహుశా వారు తన ఇతర భార్యలలో ఒకరి వద్దకు వెళ్లి ఉంటారని నేను భావించాను. తీవ్రమైన అసహనంతో నేను బయటకు వచ్చాను; అక్కడ నేను చూసిన దృశ్యం ఏమిటినగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నేల మీద సజ్దా చేస్తూ, ఒక వస్త్రపు మూటలా ముడుచుకుని ఉన్నారు. వారు ఇలా ప్రార్థించడం నేను విన్నాను:

سَجَدَ لَكَ سَوَادِي وَخَيَالِي وَآمَنَ بِكَ فُؤَادِي رَبِّ هَذِهِ يَدِي، وَمَا جَنَيْتُ عَلَى نَفْسِي،
يَا عَظِيمُ تُرْجَى لِكُلِّ عَظِيمٍ فَاغْفِرِ الذَّنْبَ الْعَظِيمَ۔

"ఓ అల్లాహ్! నా శరీరము, నా ఆత్మ నీ సన్నిధిలో సాష్టాంగపడ్డాయి; నా హృదయం నీపై విశ్వాసం ఉంచింది. ఓ నా ప్రభూ! ఇవిగో నా రెండు చేతులు నీ ముందు చాచబడి ఉన్నాయి; నా ఆత్మకు నేను చేసుకున్న అపకారం అంతయు నీ ముందు ఉంది."

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎంతో పరిపూర్ణ మానవుడు. వారిలో దైవభక్తి తప్ప మరేదీ కనిపించేది కాదు; అయినా సరే, వారు ఇలా ప్రార్థించేవారు: నా ఆత్మకు నేను చేసుకున్న అపకారం అంతయు నీ ముందు ఉంది. ఓ అత్యున్నత వైభవానికి అధిపతి! ఎవరి నుండి అయితే ప్రతి గొప్ప కార్యమూ ఆశించబడుతుందో, అట్టి నీవు, ఈ పాపాలన్నింటినీ క్షమించు."

హజ్రత్ ఆయిషా రజియల్లాహ్ తాలా అన్‌హా మరల ఇలా వివరించారు. "వారు తన పవిత్ర శిరస్సును పైకెత్తి నన్ను చూశారు, 'నువ్వు ఎందుకు బయటకు వచ్చావు?' అని అడిగారు. (నువ్వు నిద్రపోతున్నావు కదా, ఎందుకు బయటకు వచ్చావు?) నేను ఇలా విన్నవించుకున్నాను: 'నా మనసులో కలిగిన ఒక ఆలోచన వల్ల,' అంటే, 'మీరు మీ ఇతర భార్యలలో ఒకరి వద్దకు వెళ్లి ఉంటారని నేను భావించాను.' అప్పుడు వారు (స) ఇలా అన్నారు: 'నిశ్చయంగా, కొన్ని ఊహలు పాపాలుగా పరిణమిస్తాయి. నీవు నా పట్ల సందేహం పెంచుకున్నావా? అది ఒక పాపం." వారు వేరొక భార్య వద్దకు వెళ్లి ఉంటారేమోనని తాను సందేహించినట్లు హజ్రత్ ఆయిషా రజియల్లాహ్ తాలా అన్‌హా చెప్పినప్పుడు, అటువంటి అనుమానాలు పాపాలుగా మారుతాయని, వాటికి అల్లాహ్ నుండి క్షమాపణ కోరాలని ప్రవక్త (స) వివరించారు. కాబట్టి, దురభిప్రాయాల నుండి తమను తాము రక్షించుకోవడానికి, ప్రతి విషయంలోనూ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి క్షమాపణ కోరడం మరియు 'ఇస్తిగ్ఫార్' (అల్లాహ్ నుండి క్షమాపణ అభ్యర్థించడం)లో నిమగ్నమవడం అత్యంత ఆవశ్యకం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అప్పుడు హజ్రత్ ఆయిషా రజియల్లాహ్ తాలా అన్‌హాతో ఇలా అన్నారు, "వాస్తవం ఏమిటంటే, జిబ్రాయీల్ (అ) నా వద్దకు వచ్చి ఈ దుఆను పఠించమని నాకు ఉపదేశించాడు, కాబట్టి, మీరు కూడా మీ సాష్టాంగ నమస్కారాలలో వాటిని పఠించాలి. ఇప్పుడు మీరు వాటిని విన్నారు కాబట్టి, వాటిని పఠించండి. ఈ దుఆను పఠించిన వారు సజ్దా నుండి తల ఎత్తక ముందే క్షమించబడతారు."

**(మజ్మూఅల్-జవాయిద్, కితాబుస్సలాత్, హదీస్ 2775, సంపుటి 2, దారుల్ కుతుబుల్ -ఇల్మియా, బీరుత్, పేజీ 259)**

అయితే, వారు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను నిజంగా విశ్వసించి, పరిపూర్ణ విశ్వాసాన్ని కలిగి ఉండి, ఇతర సత్కర్మలను కూడా ఆచరించేవారై ఉండాలి ఇది నిబంధన. పైగా వారిఉన్నతమైన ఆధ్యాత్మిక స్థాయిని గూర్చి ప్రవక్త (స)కు తెలుసు కాబట్టి, వారు హజ్రత్ ఆయిషారాతో ఈ మాట అన్నారు. దీని అర్థం, ఇతర సత్కర్మలను నిర్లక్ష్యం చేసి, కేవలం ఈ దుఆను పఠించినచో క్షమించబడతారని అర్థం కాదు.

అదే విధంగా, సహీ ముస్లిం హదీస్‌లో మరింత వివరంగా నివేదించబడిన మరొక కథనం ప్రకారం, హజ్రత్ ఆయిషా రజి ఇలా అన్నారు: "ఒక రాత్రి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో బస చేశారు. వారు (స) ఇంటికి తిరిగి వచ్చి, తన చొక్కాను పక్కన పెట్టి, తన పాదరక్షలను తీసి పాదాల దగ్గర ఉంచి, తన పైవస్త్రం యొక్క ఒక అంచును మంచం మీద పరిచి, పడుకున్నారు. నేను నిద్రపోయానని వారు భావించి, వారు (స) నిశ్శబ్దంగా తన చొక్కాను తీసుకుని, నిశ్శబ్దంగా పాదరక్షలు ధరించి, తలుపు తెరిచి బయటకు వెళ్లి, ఆపై మెల్లగా తలుపు మూసారు. "నేను నా ముసుగు మరియు పైవస్త్రాన్ని తీసుకుని, వారు జన్నత్ అల్-బఖీకి చేరుకునే వరకు వారిని అనుసరించాను. వారు అక్కడ చాలా సేపు ప్రార్థనలో నిలబడి, ఆపై తన రెండు చేతులను మూడుసార్లు పైకి ఎత్తి, వెనుదిరిగారు. నేను కూడా వెనుదిరిగాను. వారు తన నడక వేగాన్ని పెంచారు, నేను కూడా నా వేగాన్ని పెంచాను. వారు వేగంగా నడిచారు, నేను కూడా అలాగే చేశాను. అప్పుడు వారు ఇంటికి తిరిగి వచ్చారు, నేను వారి కంటే ముందుగా ప్రవేశించి పడుకున్నాను. వారు లోపలికి వచ్చినప్పుడు, 'ఓ ఆయిషా, నీకేమైంది?' అని అన్నారు. 'మీ శ్వాస ఎందుకు భారంగా ఉంది?' వేగంగా నడవడం వల్ల నా శ్వాస భారంగా మారింది, అది దైవ ప్రవక్త (స) గారు గమనించారు. నేను ఆ విషయాన్ని దాటవేయడానికి ప్రయత్నిస్తూ, 'ఏమీ లేదు,' అన్నాను. వారు 'నువ్వు నాకు తప్పక చెప్పాలి.' అన్నారు. లేకపోతే, సూక్ష్మమైన మరియు సర్వజ్ఞుడైన అల్లాహ్ నాకు తెలియజేస్తాడు.' నేను, 'ఓ అల్లాహ్ ప్రవక్తా! నా తల్లిదండ్రులు మీ కోసం బలిదానం అగుగాకా!,' అని అన్నాను. ఆ తర్వాత నా మనసులో మెదిలినదంతా, నేను వారిని ఎలా అనుసరించానో వారికి చెప్పాను. "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, 'అయితే నా ముందు నేను చూసిన నీడ నువ్వేనా?' నేను, 'అవును,' అని బదులిచ్చాను. అప్పుడు వారు నాకు తెలిసే విధంగా తన చేతితో నా ఛాతీపై తట్టి, 'అల్లాహ్ మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నీకు అన్యాయం చేస్తారని అనుకున్నావా?'" అని అన్నారు. హజ్రత్ ఆయిషా రజి ఇలా అన్నారు, "ప్రజలు ఏది దాచిపెట్టినా, అది అల్లాహ్‌కు ఖచ్చితంగా తెలుసు. నిజానికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు అది తెలుసు మరియు ఆయన దానిని నీకు తెలియజేసి ఉండేవాడు; అందువల్ల, నా హృదయంలో ఉన్నది నేనే మీకు చెప్పాను." దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, "నేను బయటకు వెళ్తుండగా మీరు చూసినప్పుడు, జిబ్రాయీల్ నా వద్దకు వచ్చి నన్ను పిలిచాడు. అతను ఈ విషయాన్ని మీ నుండి రహస్యంగా ఉంచినందున, నేను అతని ఆదేశాన్ని అంగీకరించి, దానిని మీ నుండి కూడా రహస్యంగా ఉంచాను. అందుకే నేను మీకు తెలియజేయకుండా అతనితో పాటు వెళ్ళాను. మీరు నిద్రపోయి ఉంటారని నేను అనుకున్నాను, మరియు మిమ్మల్ని మేల్కొపడం నాకు ఇష్టం లేదు. ఒకవేళ నేను మీకు చెప్పి ఉంటే, మీరు ఒంటరిగా మిగిలిపోయారని భావించి, ఏకాకిగా భావిస్తారేమోనని కూడా నేను భయపడ్డాను." వారు ఇంకా ఇలా అన్నారు, "బఖీ ప్రజల వద్దకు వెళ్లి వారి కోసం క్షమాపణ కోరమని మీ ప్రభువు మీకు ఆజ్ఞాపిస్తున్నాడని జిబ్రాయీల్ నాకు చెప్పాడు."హజ్రత్ ఆయిషా రజి ఇలా విన్నవించుకున్నారు, "ఓ అల్లాహ్ ప్రవక్తా! ఈ ప్రతిఫలంలో నేను కూడా ఎలా పాలుపంచుకోగలను? నేను వారి కోసం ఏ ప్రార్థన చేయాలి? మీరు ఇప్పటికే వారి కోసం ప్రార్థించారు, కానీ నేను కూడా అక్కడి నుండే వచ్చాను, కాబట్టి నేను ఏమి ప్రార్థించాలి?" దానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, "ఇలా చెప్పు:

"ఈ ఆశ్రమంలోని విశ్వాసులు మరియు ముస్లింల నివాసులపై శాంతి కలుగుగాక. మాలో ముందుగా వెళ్ళిపోయిన వారిపైనా మరియు తరువాత రాబోయే వారిపైనా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కరుణించుగాకా!, మరియు ఇన్షా-అల్లాహ్, మేము కూడా మీతో కలుస్తాము."

**(సహీ ముస్లిం, ఉర్దూ అనువాదం, సంపుటి 4, కితాబుల్-జనాయిజ్, హదీస్ 1607, నూర్ ఫౌండేషన్ రబ్వా, పేజీలు 138-140)**

అదే విధంగా, ప్రవక్త (స) ఈ దుఆను కూడా బోధించారు.

అదేవిధంగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రేమకు సంబంధించి, అతా ఇలా వివరిస్తారు: "నేను, హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ మరియు ఉబైద్ బిన్ ఉమైర్‌లతో కలిసి హజ్రత్ ఆయిషా రజి గారి సన్నిధికి వచ్చాను. హజ్రత్ ఇబ్నే ఉమర్ ఇలా అన్నారు, 'అల్లాహ్ యొక్క సందేశవారుని (సల్లల్లాహు అలైహి వసల్లం) లో మీరు గమనించిన అత్యంత ప్రియమైన మరియు అద్భుతమైన విషయం గురించి మాకు చెప్పండి.'" కథకుడు ఇలా పేర్కొన్నారు, "ఇది విన్న వెంటనే, హజ్రత్ ఆయిషా రజి ఏడవడం ప్రారంభించి, 'వారి ప్రతి విషయం ప్రియమైనది మరియు అద్భుతమైనది' అని అన్నారు. ఆ తర్వాత ఆమె ఇలా వివరించారు, 'ఒకసారి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ఇంట్లో బస చేశారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమె వద్దకు వచ్చారు. వారు ఆమెతో పాటు దుప్పటిలోకి ప్రవేశించి, తన శరీరంను ఆమె

శరీరాన్ని తాకినప్పుడు (ఆమె హుజూర్ (స) శరీరాన్ని తన శరీరానికి సమీపంచినప్పుడు అనుభూతి చెందారు), వారు(స) ఇలా అన్నారు, "ఓ ఆయిషా, నీవు అనుమతిస్తే, ఈ రాత్రి మిగిలిన భాగాన్ని నా ప్రభువు ఆరాధనలో గడుపుతాను."' ఆమె ఇలా బదులిచ్చారు, "మీ సాన్నిధ్యం నాకు ఇష్టం, మరియు మీ కోరిక కూడా నాకు ఇష్టం." సరే. (మీ సాన్నిధ్యాన్ని నేను ఎంతో ఆదరిస్తాను మరియు మీ కోరికను గౌరవిస్తాను). మీ కోరికలన్నీ నెరవేరడమే నాకు అన్నిటికన్నా ఎక్కువ ఇష్టం. మీరు ప్రార్థించుకోవాలని కోరుకుంటే, అలాగే చేయండి." అప్పుడు ప్రవక్త (స) ఇంట్లో ఉన్న ఒక నీటి కొళాయి వద్దకు వెళ్ళి, కొద్దిపాటి నీటితో వజూ (శుద్ధి) చేసుకున్నారు. ఆ తర్వాత వారు నిలబడి ఖురాన్ పఠిస్తూ, ఏడవడం ప్రారంభించారు. వారి కన్నీళ్ళు తన వస్త్రం వరకు చేరుకున్నాయి. ఆ తర్వాత వారు తన కుడి వైపునకు తిరిగి పడుకుని, తన కుడి చేతిని చెంప కింద పెట్టుకుని, మళ్లీ ఏడవడం ప్రారంభించారు. ఫలితముగా వారి కన్నీళ్లు నేలపై పారాయి. అప్పుడు ఫజర్ నమాజ్ సమయం కావడంతో, వారికి ఈ విషయం చెప్పడానికి హజ్రత్ బిలాల్ రజివచ్చారు. ప్రవక్త (స) ఏడవడం చూసి, "ఓ అల్లాహ్ ప్రవక్తా! సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మీ గత మరియు భవిష్యత్ పాపాలన్నింటినీ క్షమించినప్పుడు మీరు ఏడుస్తున్నారా?" అని విన్నవించుకున్నారు. దానికి ప్రవక్త (స) "అలాంటప్పుడు నేను కృతజ్ఞతగల సేవకుడిగా ఉండకూడదా?" అని బదులిచ్చారు.

**(అఖ్లాఖుల్-నబీ వా ఆదాబహు, హదీస్ 553, దార్-ఉల్-లు'లుతూ, కైరో, 2016, పేజీలు 408-409)**

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి కృతజ్ఞతా గుణం గురించి నేను గత ఉపన్యాసంలో ప్రస్తావించాను, దాని మరిన్ని వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

మరొక కథనంలో, హజ్రత్ ఆయిష రజి ఇలా పేర్కొన్నారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మేఘాలను లేదా బలమైన గాలులను చూసినప్పుడల్లా, వారి ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపించేది. ఆమె ఇలా అన్నారు, "ఓ అల్లాహ్ యొక్క సందేశవారుడా!, ప్రజలు మేఘాలను చూసినప్పుడు, వర్షం వస్తుందని ఆశిస్తూ సంతోషిస్తారు, కానీ మీరు మేఘాలను చూసినప్పుడల్లా మీ ముఖంలో ఆందోళన కనిపించడం నేను గమనించాను." వారు ఇలా బదులిచ్చారు, "ఓ ఆయిషా, దానిలో వినాశకరమైన గాలి రూపంలో శిక్ష లేదని నేను ఎలా నిశ్చయించుకోగలను? నాకు అదృశ్య జ్ఞానం లేదు. పూర్వ జాతులపై పడిన శిక్ష దానిలో లేదని నాకు ఏది నిశ్చయ పరచగలదు? ఒక పూర్వ జాతి ఒకప్పుడు ఆ శిక్షను చూసి, 'ఇది మాపై వర్షం కురిపించే మేఘం' అని చెప్పింది (పవిత్ర ఖురాన్‌లో పేర్కొన్నట్లుగా). అందువల్ల, దానిలో ఏముందో లేదో నాకు తెలియదు, మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల నాకున్న భయం మరియు నా హృదయంలో ఆయనపై ఉన్న ప్రేమ కారణంగా నేను ఆందోళన చెందుతున్నాను."

**(సహీ-బుఖారీ, ఉర్దూ అనువాదం, సంపుటి 12, కితాబ్-ఉల్-తఫ్సీర్, హదీసు 4829, నజారత్ ఇషాత్, రబ్వా, పుటలు 68-69)**

మరొక ఉల్లేఖనంలో, హజ్రత్ ఆయిషా (ర.అ) గారు అదే సంఘటనను ఈ విధంగా వివరించారు: "దైవ ప్రవక్త (స.అ.స) గారు ఆకాశంలో మేఘాలు ముసురుకోవడం చూసినప్పుడల్లా, వారు ఆందోళనకు గురయ్యేవారు; అటు ఇటు తిరుగుతూ, తన ఇంటిలోకి వెళ్లడం, బయటకు రావడం పదే పదే చేసేవారు, మరియు వారి ముఖకాంతిలో మార్పు వచ్చేది. చివరకు ఆ మేఘాలు వర్షాన్ని కురిపించడం ప్రారంభించినప్పుడు, వారి ఆందోళన తొలగిపోయి, తిరిగి ప్రశాంత స్థితికి చేరుకునేవారు."

ఒకసారి హజ్రత్ ఆయిషా (ర.అ) గారు దైవ ప్రవక్త (స.అ.స) గారిని, ఈ విధమైన అశాంతికి గల కారణం ఏమిటని అడిగారు. దానికి దైవ ప్రవక్త (స.అ.స) గారు ఇలా సమాధానమిచ్చారు: "ఈ మేఘాలు, 'ఆద్' జాతి ప్రజలు చూసిన మేఘాల వంటివేనా కాదా అన్న విషయం నాకు తెలియదు. సూరా అల్-అహ్ఖాఫ్‌లో పేర్కొన్నట్లుగా, ఆ 'ఆద్' జాతి ప్రజలు తమ లోయల వైపు దూసుకొస్తున్న మేఘాలను చూసి, 'ఇవి మనకు వర్షాన్ని తెచ్చే మేఘాలు' అని అనుకున్నారు; కానీ వాస్తవానికి, అవి వారిపైకి ఒక శిక్షను మోసుకొచ్చాయి."

**(సహీ-బుఖారీ, ఉర్దూ అనువాదం, సంపుటి 6, కితాబ్ బుదఉల్-ఖల్క్, హదీసు 3206, నజారత్ ఇషాత్, రబ్వా, పుటలు 29-30)**

మరొక ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ అబూ హురైర (ర.అ) ఇలా అన్నారు: "దైవ ప్రవక్త (స.అ.స) మరియు ఆయన సహచరులు వర్షపు తొలి చినుకులు పడినప్పుడు తమ నాలికలను తెరిచి ఉంచేవారు, తద్వారా ఆ వర్షం వారిపై పడేది. అప్పుడు దైవ ప్రవక్త (స.అ.స) ఇలా అనేవారు: 'ఇది మా ప్రభువు నుండి మా వద్దకు ఇప్పుడే తాజాగా వచ్చింది, మరియు ఇది ఆశీర్వాదాలతో నిండి ఉంది."

( కంజులుల్ ఆమాల్,సంపుటి 1, భాగం 2, పేజి 267, కితాబుల్ అజ్కార్, హదీస్ 4936, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)

సాధారణ వర్షం కురిసినప్పుడు కూడా, ఇలా చేయడం ప్రవక్త (స) ఆచరణలలో ఒకటిగా ఉండేది.

'ఉర్వా బిన్ జుబైర్ (ర.అ) ఇలా వివరించారు. ఒకసారి ఆయన హజ్రత్ అబ్దుల్లా బిన్ 'అమర్ బిన్ అల్-'ఆస్ (ర.అ) ను ఇలా అడిగారు, "విగ్రహారాధకులు దైవ ప్రవక్త (స.అ.స) పట్ల ప్రదర్శించిన అత్యంత దారుణమైన ప్రవర్తన గురించి నాకు వివరించండి." ఆయన ఇలా సమాధానమిచ్చారు: "ఒకసారి, దైవ ప్రవక్త (స.అ.స) కాబాలోని 'హతీమ్' ప్రాంగణంలో నమాజు చేస్తుండగా, 'ఉక్బా బిన్ అబీ ము'ఇత్ అక్కడికి వచ్చాడు. అతను తన వస్త్రాన్ని ప్రవక్త (స.అ.స) మెడ చుట్టూ బిగించి, వారిని ఉరితీసినట్లుగా ఊపిరి ఆడకుండా నొక్కడం ప్రారంభించాడు. సరిగ్గా ఆ సమయంలోనే, హజ్రత్ అబూ బకర్ (ర.అ) అక్కడికి చేరుకున్నారు. ఆయన 'ఉక్బా భుజాన్ని గట్టిగా పట్టుకుని, దైవ ప్రవక్త (స.అ.స)నుండి అతన్ని పక్కకు లాగారు. ఆపై ఇలా అన్నారు:

'ఒక వ్యక్తి 'నా ప్రభువు అల్లాహ్' అని చెప్పినంత మాత్రాన, మీరు అతనిపై దాడి చేస్తారా?"

**(సహి బుఖారి, అనువాదం. సంపుటి 7, పేజి 332, కితాబుల్ మనాకిబ్ అన్సార్ హదీసు 3856,)**

ప్రవక్త (స) అల్లాహ్ ప్రేమలో పూర్తిగా లీనమై, ఆయన ఆరాధనలో నిమగ్నమై ఉన్నారు; అయినప్పటికీ, మీరు ఆయనకు హాని తలపెట్టడానికి కంకణం కట్టుకున్నారా!

దైవ ప్రవక్త (స.అ.స) జీవితమంతా దైవ ప్రేమలో మునిగి తేలింది. ఆ దైవ ప్రేమ యొక్క అద్భుత దృశ్యాన్ని చూసే మక్కా ప్రజలు ఇలా అన్నారు: ఇన్న ముహమ్మదన్ అషిక రబ్బహు. అనగా "నిశ్చయంగా, ముహమ్మద్ (స.అ.స) తన ప్రభువు యొక్క ప్రేమికుడిగా మారిపోయారు."

**(అల్-ముంఖిజ్ మిన్ అల్-దలాల్, ఇమామ్ గజాలి, దార్-ఉల్-మిన్హాజ్, పే.107, 2015)**

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏకైక దేవుడిని తీవ్రంగా, గాఢంగా ప్రేమించేవారు, మరియు ఆ ప్రేమలో ఆయన ప్రపంచంలో మరెవరూ ఎన్నడూ పొందలేని అనుభూతిని పొందారు. అల్లాహ్ పట్ల వారి ప్రేమ ఎంత గాఢమైనదంటే, సామాన్య ప్రజలు కూడా ఇలా అనేవారు: అషిక ముహమ్మదున్ అలా రబ్బిహీ అనగా "ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ప్రభువు ప్రేమలో పడ్డారు."

(మల్ఫుజాత్, సంపుటి 6, పేజి 6, 2022)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"సహచరులు (అల్లాహ్ వారిపై ప్రసన్నుడగుగాక) వారి ముఖాన్ని చూశారు" ఆ సత్యవంతుడు, అల్లాహ్‌ను ప్రేమించేవాడని అవిశ్వాసులైన ఖురైషులు సైతం స్వచ్ఛంగా సాక్ష్యమిచ్చారు. ఈ ప్రజలు, ప్రవక్త (స) దైనందిన ప్రార్థనలను, ప్రేమపూర్వక సజ్దాలను, వారి సంపూర్ణ విధేయతను, వారి ముఖంలోని పరిపూర్ణ ప్రేమ మరియు భక్తి యొక్క ప్రకాశవంతమైన చిహ్నాలను గమనించి, వారి ముఖంపై కురుస్తున్న దైవిక కాంతిని చూసి, ఇలా అనక తప్పలేదు:

అషిక ముహమ్మదున్ అలా రబ్బిహీ "దీని అర్థం: "ముహమ్మద్ (స) తన ప్రభువును గాఢంగా ప్రేమిస్తున్నాడు. అంతేకాకుండా, సహచరులు ఆ భక్తి, ప్రేమ మరియు చిత్తశుద్ధిని మాత్రమే గమనించకుండా, మన ప్రభువు మరియు నాయకుడైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హృదయంలో ఉప్పొంగిన ఆ ప్రేమకు సరి సమానంగా, అసాధారణమైన మద్దతు మరియు సహాయం రూపంలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారిపై చూపిన ప్రేమను కూడా వారు గమనించారు. ఈ విధంగా వారు అల్లాహ్ ఉన్నాడని గ్రహించారు, మరియు అల్లాహ్ ఈ వ్యక్తితో ఉన్నాడని వారి హృదయాలు బిగ్గరగా సాక్ష్యమిచ్చాయి. వారు దైవిక అద్భుతాలను ఎంతగానో చూశారు మరియు దివ్యమైన సూచనలను ఎంతగానో వీక్షించారు, దానితో అల్లాహ్ అనే పేరుగల ఒక సర్వోన్నత శక్తి నిజంగా ఉన్నాడని, ఆయనే సర్వాధికారి అని, ఆయనకు అసాధ్యమైనది ఏదీ లేదని వారికి ఏమాత్రం సందేహం లేకుండా పోయింది. అందుకే వారు అటువంటి భక్తి మరియు చిత్తశుద్ధితో కూడిన కార్యాలను ప్రదర్శించారు మరియు అటువంటి త్యాగాలను చేశారు, సందేహాలు మరియు అనుమానాలన్నీ తొలగిపోయే వరకు ఎవరూ చేయడం సాధ్యం కాదు. ఆ పవిత్ర సత్తా యొక్క ప్రసన్నత కేవలం ఇస్లాంను స్వీకరించడంలోనూ, ఆయన గౌరవనీయ ప్రవక్తల (స) ఆజ్ఞలను మనసా, వాచా, కర్మణా పాటించడంలోనూ మాత్రమే ఇమిడి ఉందని వారు తమ కళ్ళతో స్వయంగా చూశారు. ఈ సంపూర్ణ నిశ్చయత కలిగిన పిమ్మట, వారు ప్రదర్శించిన విధేయత, వారు సాధించిన

ఘనకార్యాలు మరియు తమ పవిత్ర మార్గదర్శి పాదాల చెంత వారు తమ ప్రాణాలను అర్పించిన తీరు నిజంగా అద్వితీయమైనవి.

**(షహాదతుల్ ఖురాన్, రూహానీ ఖజాయిన్, సంపుటి 6, పుట 346 పవిత్ర ఖురాన్ సాక్ష్యం, పుటలు 79-80)**

ఇటువంటి ఘన విజయాలు ప్రత్యక్ష అనుభవం లేకుండా సాధ్యం కావు. హజ్రత్ అలీ (ర) ఇలా ఉల్లేఖించారు:

"ఒకసారి నేను దైవ ప్రవక్తను (స) వారి జీవన విధానం గురించి, అంటే వారి ప్రాథమిక సూత్రం ఏమిటి అని అడిగాను. దానికి వారు ఇలా సమాధాన మిచ్చారు: 'దైవ జ్ఞానమే నా మూలధనం." అంటే, వారి జీవన విధానం ఏమిటని, వారి ఉనికి ఏ సూత్రంపై ఆధారపడి ఉందని అడిగినప్పుడు, దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు:

"దైవ జ్ఞానమే నా సంపద, మరియు వివేకమే నా విశ్వాసానికి పునాది. ఆ దేవుడు నాకు ప్రసాదించిన దైవ జ్ఞానమే నా నిధి; ఆయన నాకు అనుగ్రహించిన బుద్ధిని, నేను ఆయన ప్రేమలోనూ, ఆయన అవతరింపజేసిన మార్గదర్శకత్వం ప్రకారమే వినియోగిస్తాను. ఇదే నా విశ్వాసానికి సారం మరియు పునాది; అల్లాహ్ పట్ల ప్రేమయే నా జీవితానికి మూలాధారం." వారు ఇంకా ఇలా కొనసాగించారు: "దైవ మార్గంలో ముందుకు సాగాలనే తపనయే నా వాహనం. ఆయన ప్రేమలోనూ, ఆయన మార్గంలోనూ నేను నిరంతరం ముందుకు సాగుతుంటాను. ఈ గాఢమైన వాంఛయే నా అశ్వం; దీనిపైనే నేను ఎల్లప్పుడూ పురోగమిస్తూ, కృషి చేస్తూ ఉంటాను. అల్లాహ్ స్మరణమే నా సహచరుడు మరియు నాకు ఓదార్పునిచ్చేది. నా నిజమైన మిత్రుడు, నాకు సాంత్వననిచ్చేవాడు, నా హృదయానికి ప్రశాంతతను కలిగించేవాడు, అల్లాహ్ స్మరణ మరియు ప్రార్థన తప్ప మరెవరూ లేరు. అల్లాహ్ పై నమ్మకమే నా నిధి. నేను కేవలం ఆయనపైనే ఆధారపడతాను; ఆ ఆధారపడటమే నా సంపద." మీరు అడుగుతున్న జీవన విధానం ఇదే. దుఃఖం, శోకం నా సహచరులని తెలుసుకోండి. నాకు నొప్పి లేదా కష్టం ఎదురైనప్పుడు, అవి నా జీవితంలో ఒక భాగం, మరియు నేను వాటిని పట్టించుకోను, ఎందుకంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నాతో ఉన్నాడు." ఆయన ఇంకా ఇలా అన్నారు,

"జ్ఞానమే నా ఆయుధం. జ్ఞానాన్ని సంపాదించమని అల్లాహ్ ఆజ్ఞాపించాడు, ఎందుకంటే అది మనసును ప్రకాశవంతం చేస్తుంది మరియు దైవంపై అవగాహనను పెంచుతుంది. సాక్షాత్తు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యే నాకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు, మరియు దేవుని నుండి వచ్చే దానికంటే గొప్ప ఆయుధం ఏముంటుంది? ఇదే నా ఆయుధం, దీని ద్వారా నేను పురోగతిని సాధిస్తాను." ఇంతకుముందు పేర్కొన్న యుద్ధాల వృత్తాంతాలలో చూసినట్లుగా, ప్రాపంచిక విషయాలలో కూడా, అల్లాహ్ ప్రవక్త (స)కు అటువంటి జ్ఞానాన్ని ప్రసాదించాడు, దాని ఫలితంగా వారి ప్రణాళిక మరియు వ్యూహం అత్యున్నత స్థాయిలో ఉండేవి. అదేవిధంగా, వారి ఆధ్యాత్మిక జ్ఞానం అపారమైనది, స్పష్టమైనది మరియు అందరికీ ప్రస్ఫుటమైనది.

ఆయన ఇంకా ఇలా అన్నారు, "సహనమే నా పైవస్త్రం." అంటే, వారి వస్త్రం (అలా చెప్పాలంటే) సహనం. "దైవ సంకల్పంతో సంతృప్తి చెందడమే నాకు యుద్ధంలో లభించిన బహుమతి. నేను దేవుని అనుగ్రహంలో సంతృప్తిగా ఉంటాను." పేదరికమే నా గర్వం; నేను పేదవాడినని లేదా సంపద లేనివాడినని స్పష్టంగా కనిపించినప్పటికీ, నేను దానిని గర్విస్తాను. ఈ పేదరికపు స్థితిలో ఉన్నప్పటికీ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నన్ను అపారంగా ఆశీర్వదించాడనే వాస్తవాన్ని నేను గర్విస్తాను. సంయమనం నా నైపుణ్యం. భక్తి మరియు ఆత్మనిగ్రహం నా కళ, మరియు దానిని పరిపూర్ణం చేయడానికి నేను ప్రయత్నిస్తాను. నిశ్చయత్వమే నా బలం. అల్లాహ్ పై సంపూర్ణ విశ్వాసమే నా బలానికి మూలం. సత్యసంధతే నా సిఫారసుదారు. నేను ఎన్నడూ అసత్యం మాట్లాడలేదు, మరియు సత్యమే నా సిఫారసు సాధనం. విధేయత నాకు చాలు. నేను సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రతి ఆజ్ఞకు సంపూర్ణ విధేయతతో నడుచుకుంటాను. జిహాద్ నా నడవడికి పునాది. అది శారీరక శ్రమ అయినా, అల్లాహ్ మార్గంలో ఆధ్యాత్మిక శ్రమ అయినా, లేదా దైవ సృష్టి హక్కులను నెరవేర్చడం అయినా, ఇదే నా నైతిక నడవడికి ఆధారం. ప్రార్థనే నా కన్నులకు ఆనందం. ఈ గుణాలన్నీ నాలో అంతర్భాగమే అయినప్పటికీ, నా కళ్ళకు నిజమైన సాంత్వన ప్రార్థనలో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు సామీప్యాన్ని పొందడంలో, ఆయనను ఆరాధించడంలో మరియు ఆయన పట్ల నా ప్రేమను వ్యక్తపరచడంలోనే ఉంది.

మరొక హదీసులో ప్రవక్త (స) ఇలా అన్నారు, "నా హృదయ ఫలం అల్లాహ్ స్మరణలో ఉంది, మరియు నా ఆకాంక్ష నా ప్రభువుపై ఉంది."

**(అల్-షిఫా బి తారిఫ్ హుఖూఖ్ అల్-ముస్తఫా, ఖాదీ అయ్యాద్, హదీసు 347-348, పుట 191, యుఎఇ, 2013,)**

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నెలకొల్పిన ఆదర్శానికి మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల వారికున్న ప్రేమకు సంబంధించిన కొన్ని ఉదాహరణలను మాత్రమే నేను ఇక్కడ అందించాను. ఇదే ఆదర్శం సహచరులలో ఒక విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చింది, తద్వారా వారు ఇంతకుముందు ఊహించలేని స్థాయిని సాధించగలిగారు. నేను ఇంతకుముందు అందించిన ఉల్లేఖనంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పేర్కొన్నట్లుగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క దాసుడైన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడా ఇదే సంపూర్ణమైన మరియు పరిపూర్ణమైన బోధనను అనుకరించారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు తాను చూపిన సంపూర్ణ విధేయత కారణంగా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన అనుగ్రహాలను తనకు ప్రసాదించాడని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సందర్భంలో, పేర్కొన్నారు.

వారు (అ) ఇలా తెలిపారు:

"నాకు కలలో రెండు సార్లు పంజాబీ భాషలో పద్యాలు తెలియజేయబడ్డాయి. వాటిలో ఒకటి ఇలా గలదు. జేతూ మేరా హొహ రహేఁ సబ్ జగ్ తీరా హొ.అనగా 'నువ్వు నాకు అంకితమైతే, ప్రపంచం మొత్తం నీదే అవుతుంది.

మరియు మరొకటి ఏమిటంటే, ఒక విశాలమైన క్షేత్రం ఉన్నది. దానిలో ఒక మజ్జుబ్ (అంటే, భగవంతుని ప్రేమలో పూర్తిగా మునిగిపోయిన వ్యక్తి) నా వైపు వేగంగా వస్తున్నాడు. అతను నా దగ్గరికి వచ్చినప్పుడు, అతను ఇలా చెప్పాడు:

ఇష్కే ఇలాహి వస్సే మూ పర్ వలియాఁ ఈఁ నిషానిఁ

"ఒక సాధువు అతని ముఖంపై దైవిక ప్రేమ ప్రకాశించడం ద్వారా గుర్తించబడతాడు."

**(తజ్కిరా పేజీ 439-440, ప్రచురణ 2023)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు చూపబడిన ఈ కల యొక్క అర్థం ఏమిటంటే, ఆ వ్యక్తి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను చూసి ఈ మాట చెప్పాడు, ఎందుకంటే అతను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంలో దైవిక ప్రేమ యొక్క కాంతిని చూశాడు.

మరొక సందర్భంలో,హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తాను పొందినదంతా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు విధేయత చూపడం వలనే అని కూడా చెప్పారు.

**(హఖీఖతుల్ వహీ, రూహాని ఖజాయిన్, సంపుటి 22, పుట 64)**

అందువల్ల, ఇది వారి (అ) ఆదర్శం, మరియు ఈ కారణంగానే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ జమాత్‌ను స్థాపించారు.

నేడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క నిజమైన అనుచరులమని ప్రకటించుకొనుచున్న మనం, మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క నిజమైన మరియు స్వచ్ఛమైన దాసుని చేతిలో బైఅత్ చేయుట ద్వారా, సర్వశక్తిమంతుడైన దేవుని ఆజ్ఞలకు అనుగుణంగా మన జీవితాలను గడుపుతామని మన ప్రతిజ్ఞను పునరుద్ఘాటించాము, కాబట్టి మనం దీనిపై చాలా శ్రద్ధ వహించాలి, ఎందుకంటే మనం చేసే ప్రతి పనిని అల్లాహ్ కొరకు అత్యంత చిత్తశుద్ధితో చేయాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను ప్రేమించడం మరియు ఆయన పట్ల మన ప్రేమలో రాణించడానికి కృషి చేయడం. మనం ఇలా చేసినప్పుడు మాత్రమే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆశీర్వాదాలకు పాత్రులం కాగలం; దైవ ప్రవక్త (స) యొక్క సమాజంలో ఒక భాగంగా ఉండటానికి నిజమైన న్యాయం చేయగలం; మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ హక్కుకు నిజమైన న్యాయం చేసినవారిగా, ఆయన నిజమైన అనుచరులలో లెక్కించబడగలం. దీన్ని చేసే సామర్థ్యాన్ని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు ప్రసాదించుగాకా!.

పాకిస్తాన్‌లోని అహ్మదీయుల కోసం ప్రార్థించండి. రెండు రోజుల క్రితం, ముబారక్ సాని సాహిబ్‌కు సంబంధించిన ఒక కోర్టు కేసులో, సెషన్స్ జడ్జి ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆయన వద్ద పవిత్ర ఖురాన్ ప్రతి ఉండేదని, దానిని ఆయన స్వయంగా పఠించడమే కాకుండా ఇతరులకు కూడా బోధించేవారని ఆయనపై ఆరోపణ. కోర్టుల పరిస్థితి ఇలా ఉన్నప్పుడు, పరిస్థితి మెరుగుపడుతుందనే ఆశ ఏముంటుంది? ఈ నిర్ణయంపై అహ్మదీయేతరులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసి, దీనిని న్యాయ వ్యవస్థను అపహాస్యం చేయడంగా అభివర్ణించారు. మత పెద్దలు సాధారణంగా ఈ నిర్ణయాన్ని ప్రశంసిస్తూ, న్యాయమూర్తిని పొగుడు తున్నప్పటికీ, నిష్పక్షపాతంగా ఆలోచించే ప్రజలు, "ఆయన పవిత్ర ఖురాన్ పఠించడం, దాని ప్రతిని తన ఇంట్లో ఉంచుకుని పిల్లలకు బోధించడం అంత పెద్ద 'నేరమా'?"

అని రాశారు, మరికొందరు దీనిపై వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఏదేమైనా, పండితులు అని పిలవబడే వారి మరియు వారి అనుచరుల పరిస్థితి ఇది. కొన్ని చోట్ల, ప్రభుత్వ యంత్రాంగం ఈ మత పెద్దలను అనుసరిస్తూ వారి విధానాలను అమలు చేస్తోంది. వారిని త్వరితగతిన పట్టుకోవడానికి అవసరమైన మార్గాలను అల్లాహ్ సృష్టించాలని ప్రార్థిస్తున్నాము. ఇన్షా-అల్లాహ్, అల్లాహ్ వారిని త్వరితగతిన పట్టుకుంటాడు, మరియు అది ఆవిష్కృతమవుతున్న సంకేతాలను కూడా మనం చూడవచ్చు. కానీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మేఘాల వైపు చూసి, అదే ఆందోళనతో ఈ ప్రార్థన చేసినట్లే, మన ప్రార్థనలు, ఆచరణాత్మక ప్రవర్తన మరియు ఆరాధన హక్కులను నెరవేర్చడంలో మన నిర్లక్ష్యం కారణంగా ఇందులో ఆలస్యం జరుగుతుందేమోనని మనం ఆందోళన చెందాలి.

అందువల్ల, ప్రార్థనలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టవలసిన అవసరం ఎంతగానో ఉంది. అదేవిధంగా, ప్రపంచంలోని ఇతర పీడిత ప్రజల కోసం కూడా ప్రార్థించండి, అల్లాహ్ ప్రతి ఒక్కరికీ, ప్రతిచోటా శాంతిని ప్రసాదించాలని మరియు అందరినీ అన్ని రకాల అవాంతరాలు మరియు గందరగోళాల నుండి రక్షించాలని ప్రార్థించండి.

నమాజ్ తరువాత నేను రెండు పరోక్ష జనాజ నమాజ్‌లను చదివించుతాను. మొదటిది మౌలానా జలాలుద్దీన్ నయ్యర్ సాహిబ్. అతను మాజీ సదర్ సదర్ అంజుమన్ అహ్మదియా మరియు సదర్ మజ్లిస్ తహ్రీక్-ఎ-జాదిద్ ఖాదియన్ గారిది. ఆయన ఇటీవల మరణించారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.

అతని తండ్రి, గౌరవనీయుడైన హెచ్ హుస్సేన్ సాహిబ్, ప్రపంచ యుద్ధ సమయంలో సైన్యంలో క్లర్క్‌గా పనిచేశాడు. ఈ కాలంలో, 1922లో, బాసరలో ఉన్నప్పుడు, అతను అహ్మదీయత్‌ను అంగీకరించాడు మరియు కేరళ నుండి ప్రచురితమైన జమాత్ మ్యాగజైన్ సత్య దూతన్‌కు సంపాదకుడిగా నియమించబడ్డాడు. ఆయన స్వస్థలం కేరళ, సైన్యం నుండి విరమించుకున్న తర్వాత అక్కడికి తిరిగి వచ్చారు.

1950లో, ఖాదియాన్ పునరావాస పథకం గురించి హజ్రత్ ముస్లే-ఎ-మౌవూద్ రజి ఇచ్చిన పిలుపు మేరకు హెచ్. హుస్సేన్ సాహిబ్ స్పందించి, తన యావత్ కుటుంబంతో శాశ్వతంగా స్థిరపడటానికి అక్కడికి తరలివెళ్లారు. అయితే, ఒక సంవత్సరంలోపే ఆయన ఖాదియాన్‌లో కన్నుమూశారు. ఆ తర్వాత, మౌలానా జలాలుద్దీన్ నయ్యర్ సాహిబ్ తల్లి, జుబైదా సుల్తానా సాహిబా, ఖాదియాన్‌లో ఒక దర్వేష్ అయిన చౌదరి అబ్దుల్ హక్ సాహిబ్‌ను రెండవ వివాహం చేసుకున్నారు. ఆయన నయ్యర్ సాహిబ్ సోదర సోదరీమణుల పెంపక బాధ్యతను స్వీకరించారు.

మౌలానా జలాలుద్దీన్ నయ్యర్ సాహిబ్ తన ప్రాథమిక విద్యను ఖాదియాన్‌లో అభ్యసించారు మరియు 1963లో మౌల్వి ఫాజిల్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆయనను మొదట అంజుమన్‌లో ఇన్‌స్పెక్టర్ బైత్-ఉల్-మాల్‌గా చాలా కాలం పాటు సేవ చేయడానికి నియమించారు, ఆ సమయంలో ఆయన భారతదేశవ్యాప్తంగా ఉన్న జమాత్‌లలో పర్యటించారు. అవిశ్రాంత కృషి మరియు హృదయపూర్వక ఆప్యాయతతో, ఆయన జమాత్ సభ్యులను చందాల వ్యవస్థలోకి తీసుకువచ్చారు. ఫలితంగా, ఆయన భారతదేశవ్యాప్తంగా ఉన్న జమాత్ సభ్యులతో వ్యక్తిగత సంబంధాలను పెంచుకున్నారు.

దివంగత నయ్యర్ సాహిబ్‌కు 63 సంవత్సరాల పాటు జమాత్‌కు సేవ చేసే అవకాశం లభించింది. ఇన్‌స్పెక్టర్ బైత్-ఉల్-మాల్ ఆమద్‌గా సేవ చేసిన తర్వాత, ఆయన ఆడిటర్‌గా, ఆపై ముహాసిబ్‌గా, మరియు తదనంతరం చాలా కాలం పాటు నజీర్ బైత్-ఉల్-మాల్ ఆమద్‌గా సేవ చేశారు. ఇంతకుముందు చెప్పినట్లుగా, ఆయన ఏడు సంవత్సరాల పాటు సదర్ అంజుమన్ అహ్మదీయ ఖాదియాన్‌గా నియమించబడ్డారు, ఆ తర్వాత తన ఆరోగ్యం సహకరించినంత కాలం సదర్ మజ్లిస్ తహ్రీక్-ఎ-జదీద్‌గా కూడా సేవ చేశారు.

అదేవిధంగా, ఆయనకు అనుబంధ సంస్థలలో కూడా సేవ చేసే అవకాశాలు లభించాయి. ఆయన భక్తిశ్రద్ధలతో కూడిన ఆరాధకుడు, క్రమం తప్పకుండా ఉపవాసాలు, ప్రార్థనలు చేసేవారు మరియు ఖిలాఫత్ యొక్క ప్రతి ఆదేశాన్ని పాటించడంలో అగ్రగణ్యులలో ఒకరిగా పరిగణించబడ్డారు. ఆయన ఒక క్రీడాకారుడు మరియు అథ్లెట్ కూడా, మరియు ఈ విషయంలో కూడా ఆయన అక్కడ విస్తృతమైన కార్యక్రమాలను నిర్వహించారు.

ఆయన కాశ్మీర్‌కు చెందిన ఒక కుటుంబంలో వివాహం చేసుకున్నారు. ఆయన భార్య ఆయన కంటే ముందే మరణించారు. ఆయనకు ఇద్దరు కుమారులు మరియు ఒక కుమార్తె ఉన్నారు, వారందరూ జమాత్‌లో సేవ చేస్తున్నారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనను మన్నించుగాకా! మరియు కరుణించుగాకా!.

రెండవ ప్రస్తావన మీర్ ముష్తాఖ్ అహ్మద్ సాహిబ్ గారి కుమారుడైన గౌరవనీయ మీర్ హబీబ్ అహ్మద్ సాహిబ్ గారిది. ఆయన ఇటీవల 79 సంవత్సరాల వయస్సులో కన్నుమూశారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.

ఆయన అత్యంత దయగలవారు, స్నేహశీలురు మరియు ఖిలాఫత్ పట్ల ప్రగాఢ విశ్వాసం కలిగినవారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అనుగ్రహంతో, ఆయన ఒక మూసీ కూడా. ఫరూఖ్ పత్రిక సంపాదకుడైన హజ్రత్ మీర్ ఖాసిం అలీ సాహిబ్ రజి ద్వారా 1903లో అహ్మదీయత్‌ను స్వీకరించిన ఆయన తాతగారైన అబ్దుల్ రహీం సాహిబ్ ద్వారా వారి కుటుంబంలో అహ్మదీయత్ స్థాపించబడింది. హజ్రత్ మీర్ ఖాసిం అలీ సాహిబ్ రజికు సొంత పిల్లలు లేకపోవడంతో, మీర్ హబీబ్ సాహిబ్ తండ్రి అయిన ముష్తాఖ్ అహ్మద్ సాహిబ్‌ను దత్తత తీసుకున్నారు.


మీర్ హబీబ్ సాహిబ్ లాహోర్‌లోని ప్రభుత్వ కళాశాల నుండి తన ఎఫ్ఎస్‌సి మరియు బిఎస్‌సి పూర్తి చేసి, ఆ తర్వాత భౌతిక శాస్త్రంలో ఎంఎస్‌సి డిగ్రీని పొందారు. ఆయన తర్వాత విదేశాలకు కూడా వెళ్లారు. ఆయన జమాత్ సేవల్లో భాగంగా, 1970 నుండి 1971 వరకు తాలిమ్-ఉల్-ఇస్లాం కళాశాలలో తన బోధనా వృత్తిని ప్రారంభించారు, ఆ సమయంలో ఆ కళాశాలలు ఇంకా జాతీయం కాలేదు. 1973 నుండి 1976 వరకు, ఆయన నుస్రత్ జహాన్ పథకం కింద సిరా లియోన్‌లో పనిచేశారు, అక్కడ ఫ్రీటౌన్‌లో భౌతికశాస్త్రం బోధించే అవకాశం ఆయనకు లభించింది. ఆయన 1976లో పాకిస్థాన్‌కు తిరిగి వచ్చారు, కానీ అదే సంవత్సరంలో నైజీరియాకు తిరిగి వెళ్లి, అక్కడ 1987 వరకు ఒక ప్రభుత్వ పాఠశాలలో పనిచేశారు. ఆఫ్రికాలో ఉన్నప్పుడు, 1987లో, ఆయన తన జీవితాన్ని ఒక జీవితకాల భక్తునికి అంకితం చేశారు. అదే సంవత్సరం, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబెహ్ రహ్మహుల్లాహ్ గారు ఆయనను హమ్రాషాలోని అహ్మదీయ సీనియర్ సెకండరీ పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు, అక్కడ ఆయన 1991 వరకు సేవలందించారు.

ఆ తర్వాత, ఆయన పాకిస్థాన్‌కు తిరిగి వచ్చి అక్కడ కూడా జమాత్‌కు సేవలను కొనసాగించారు. 1992లో, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబెహ్ రహ్మ ఒక సాంకేతిక సంస్థను మూల్యాంకనం చేయడానికి ఆయనను సిరా లియోన్‌కు పంపారు, మరియు ఆయన నిపుణుల నివేదిక ఆధారంగా అక్కడ కొన్ని అభివృద్ధి పనులు చేపట్టబడ్డాయి. 1996లో, నజరత్ తాలిమ్ ఆధ్వర్యంలో, ఆయన రబ్వాలోని నుస్రత్ జహాన్ అకాడమీకి నియమించబడ్డారు, అక్కడ ఆయన పదవీ విరమణ వరకు భౌతికశాస్త్ర ఉపాధ్యాయునిగా సేవలందించారు. ఆయన సదర్ ఉమూమి కార్యాలయంలో కూడా సేవలందించారు మరియు జనరల్ ఇస్లాహీ కమిటీలో స్వచ్ఛంద సేవలు అందించారు.

తన భర్త ఉపవాసం, ప్రార్థనలను క్రమం తప్పకుండా పాటించేవారని, అత్యంత సౌమ్య స్వభావం కలవారని, ఎన్నడూ ఏమీ ఆశించలేదని ఆయన భార్య రాశారు. ఆయనకు చదవడం పట్ల ప్రగాఢమైన ప్రేమ, జ్ఞానాన్ని సంపాదించాలనే తపన ఉండేవి. ఎవరైనా ఆయనకు ఏ బహుమతి తీసుకురావాలని అడిగితే, “నాకు పుస్తకాలు తీసుకురండి” అని చెప్పేవారు, మరియు ఆయన క్రమం తప్పకుండా పండితుల రచనలను చదివేవారు. అదే విధంగా, ఆయన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి పుస్తకాలను విస్తృతంగా అధ్యయనం చేశారు.

ఆయన ఎన్నడూ అసత్య ప్రకటనలు చేయలేదు. తాను చెప్పకూడదనుకున్న విషయం ఏదైనా ఉంటే, తప్పుగా మాట్లాడటం కంటే మౌనంగా ఉండటానికే ఇష్టపడేవారు. ఆయన కుమార్తె కూడా ఇదే గుణాలను ప్రస్తావించారు. నేను కూడా ఆయనను గమనించాను మరియు ఆయన తన సొంత విషయాలను చూసుకుంటూ, తన జీవిత నిబద్ధతను సంపూర్ణ విశ్వాసంతో నెరవేర్చిన ఒక గొప్ప వ్యక్తి అని కనుగొన్నాను. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనను మన్నించుగాకా! మరియు కరుణించుగాకా!.

ఆయన మీర్ ఇస్‌హాఖ్ సాహిబ్ రజి మనవరాలు మరియు మేజర్ సయ్యిద్ అహ్మద్ సాహిబ్ కుమార్తె అయిన సయ్యదా లుబ్నాను వివాహం చేసుకున్నారు. హజ్రత్ మీర్ ముహమ్మద్ ఇస్‌హాఖ్ సాహిబ్ రజి, జమాత్‌లో సుప్రసిద్ధుడైన మరియు జమాత్‌లో సర్వసాధారణంగా ఉపయోగించబడే పవిత్ర ఖురాన్‌ను అనువదించిన హజ్రత్ మీర్ నాసిర్ నవాబ్ సాహిబ్ రజి గారి కుమారుడు. ఏదేమైనా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దివంగతున్ని మన్నించుగాకా! కరుణించుగాకా!.



బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

గౌరవనీయులైన సభాధ్యక్షులు, సభకు విచ్చేసిన శ్రోతలందరికి అస్సలాము అలైహికుం వరహ్మాతుల్లాహి వబర్కాతహు. నేటి ఈ శుభప్రదమైన సమావేశంలో ఈ భవిధీయుడు " హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి జీవిత చరిత్ర. పవిత్ర ఖుర్ఆన్ పట్ల వారి (అ) కి ఉన్నటు వంటి అభిమానం మరియు పవిత్ర ఖుర్ఆన్‌కు అందించిన సేవ" అనే శీర్షికపై ఉపన్యసించుటకు మీ ముందు నిలబడ్డాడు.

ధార్మిక చరిత్రలోని 19 వశతాబ్ధపు మధ్య చివరి కాలం మరియు 20 శతాబ్ధపు ప్రారంభకాలంనకు చాలా ప్రాముఖ్యత గలదు. ఈ కాలంలో భారతదేశ ఉపఖండంలో ఒకవైపు ప్రముఖ మతాల మధ్యలో ఎంతో తీవ్రముగా, పూర్తి కంకణ కట్టుతో సిద్ధాంతపరమైన యుద్ధం జరుగుతుండగా మరోవైపు విజ్ఞాన పరిశోధనలు మరియు నూతన ఒరవడిని అలవర్చుకున్న సాంప్రదాయాల వలన మత ప్రాతిపదికలు మరియు జీవన విధానాలు చాలా వేగంగా పరివర్తనం చెందసాగాయి. ఒకవైపు క్రైస్తవం, బ్రహ్మ సమాజ్, ఆర్యసమాజ్‌లు ఇస్లాంపై దండయాత్రలు చేయుచుండగా మరోవైపు ముసల్మానులు ఏ పరిస్థితులలో ఉన్నారనగా వారి అసంఖ్యాకమైన ఉలమాలు ఈ బాహ్య దండయాత్రలు తమకు పట్టవన్నట్లుగా, అంతర్గత కలహాలు, వర్గవిబేధాల తగాదలే తమకు మోక్షాన్ని చేకూర్చుతాయని భావించి కూర్చిండి పోయారు. వారి దృష్టిలో ఇస్లాంధర్మపు నలు అంచులలో ముసల్మానులు అంతర్గత అలలకు చిక్కి కొట్టుకొనుచూ ముక్కలు ముక్కలు కావడం మరియు రక్తాంను ప్రవహింపజేయడంమే జిహాద్‌గా పేరుపొందెను. ఒకరి జుట్టు ఒకరు పట్టుకున్న ఈ వర్గీయులే గాకుండా మరోవైపు పేరుగాంచిన ఉలమాలు నిఖాహ్, ఫాతిహ ఖానియాంల మిఠాయిలు, యూసూఫ్ జులైఖా మరియు మలక సబా కథలను, స్వర్గపు అందచందాల వర్ణణలు, వాగ్దానాలతో గ్రామీణ ప్రాంతాల ముసల్మానుల హృదయాలను రంగుల వల్లికలతో మైమరి పించసాగారు. ఇస్లాం, పవిత్ర ఖుర్ఆన్ ఏ మవుతున్నాయి? మన ప్రియతమ నాయకుడు, దైవసన్నిహితులు హజ్రత్ ముహమ్మద్ అరబీ సల్లల్లాహు అలైహి వసల్లంపై ఎలాంటి దుర్మార్గపు, నిసిగ్గు దాడులు చేస్తున్నారు అనే అంశాలను గూరి వారి జిన్నాతులకు కూడ సమాచారం లేదు. కేవలం కల్పిత కథనాలను విస్తరింపజేయుటలోనే వారు ఎల్లప్పుడు మునిగి పోయేవారు.

ఇస్లాం కొరకు చింతించు, ఆందోళన చెందు, బాధించు ఆ కాలంలో అహ్మదియ్యత్ తేజస్సు ప్రకాశించింది. ఖాదియాన్‌కు చెందిన ఈ పవిత్రమైన నగరంలో ఆ కాలంలో ఒక పట్టుదల మరియు వైభవోపేతుడైన సంస్కర్త జన్మించారు. వారు ఇంత చిన్న మరియు విజ్ఞాన రహిత ఈ పరిసరల్లలో తమ జీవితపు 40 వసంతాలను తమ పూర్వికుల ఒక కోటిలో లేదా చిన్నపాటి మస్జిద్‌లోని ఒక మూలకు మౌనండగా, చింతనతో, ఆందోళన, ఆలోచన మరియు అధ్యాయణాలతో గడిపారు. తన ఆధ్యాత్మికత వలన 1300ల సంవత్సరాల పూర్వం ప్రపంచమంత ఎంతో వైభవముగా ప్రకాశించినట్టి ఇస్లాం యొక్క తేజోవంతమైన ముఖానికి నేడు దుమ్ముతూళి పట్టిపోవడాన్ని వారు చూశారు. ఫలితముగా వారి మనస్సులో కల్గిన బాధ ఎగిరి ఎగిరి పడుతూ బయటికి వెళ్ళుటకు మార్గంను అన్వేషించసాగింది. కాని వారు ఆ బాధను మనస్సులోనే దాచుకున్నారు. అలా వారి ఆ బాధమొత్తం ఒక రూపాన్ని దాల్చుకొని లావా వలే మారిపోయింది. అదే విధముగా కాగితపు లక్షణంపై విస్తరించి చివరిగా బరాహీనే అహ్మదియ్యాగా రూపాన్ని పొందింది.

బరాహీనే అహ్మదియ్య అనగా ఏమిటి?. ఇస్రాఫీల్ దేవదూత శంఖం. అది ధార్మిక ప్రపంచాన్ని కదిలించింది. భారతదేశపు నలుమూలలో చాలా కాలం నుండి నిద్రలో మునిగిన ముసల్మానులు మేల్కొవడం ప్రారంభించారు. ముహమ్మద్ (స) తోటలో పూలు విరబూస్తున్నాయనే సంభాషణలు చేసుకోసాగారు. బరాహీనే అహ్మదియ్య ప్రచురించడం వలన ముసల్మాను లందరు హర్షంను వ్యక్తపరిచారు. పండుగ చేసుకోసాగారు. నలువైపుల నుండి ప్రశంసలు, ఆశిర్వాదాలు పంపసాగారు. గత 13 శతబ్దాలలో బరాహీనే అహ్మదియ్య రచయిత ఇస్లాంకు చేసిన సేవలు మరెవ్వరు కూడ చేయలేదని వ్రాసారు. మరొకరు దేవుని కొరకు మీరు మసీహ్‌గా అవతరించుమని దుఆలు ఇచ్చారు. మొత్తానికి బరాహీనే అహ్మదియ్య ఖుర్ఆన్ ఆధారాలతో కూడిన ఒక ఇస్లామీయ ఇన్సైక్లోపీడియాగా నిలిచింది. ముస్లిం విజ్ఞావేత్తలలో చాలా ఆధారణను సంపాదించుకున్నది. అదే సమయంలో ఇస్లాం శత్రువుల ఇళ్ళలో శోఖాన్ని మిగిలించిది.

వీరు హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం గారు చేసిన భవిష్యవాణిలో పేర్కొనబడిన ఫారిస్ వ్యక్తియే. అనగా లౌకానల్ ఈమాను ఇందస్సురయ్యా లనాలహు రిజాలున్ అవ్ రజులున్ మిన్ హావులాయి.

(బుఖారికితాబు తఫ్సీరు, జుమా అధ్యాయం, ముస్లిం)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెల్పుచున్నారు: "ప్రళయకాలంలో పవిత్ర ఖుర్ఆన్ (బోధనలు) భూమండలంపై నుండి పైకి తీసుకోబడును. ఖుర్ఆన్ విజ్ఞానం కనుమరుగైపోవును. మూర్ఖత్వం విస్తరించును. విశ్వాస ఉత్సాహం, మాధుర్యం మనస్సులో నుండి మాయమైపోవును. మరల ఆ అహదీస్‌లలో మరొక హదీస్ కూడ గలదు. అనగా విశ్వాసం కృతీక నక్షత్రం వరకు చేరుకున్నా కూడ అనగా ఈ భూమండలం పై నుండి నామరూపాలు లేకుండా పోయినా కూడ ఫారసీయులకు చెందిన ఒక వ్యక్తి తమ చేతిని చాపి దానిని కృతీకా నక్షత్రము నుండి తిరిగి తీసుకవచ్చును. కావున ఈ హదీస్ ద్వారా స్పష్టముగా తెలియున దేమనగా ఇతర హదీస్‌లలో పొగవలే పేర్కొనబడిన మూర్ఖత్వం, అవిశ్వాసం, అన్యాయం ఎప్పుడైతే ఈ ప్రపంచంలో విస్తరించునో, అప్పుడే నిజమైన విశ్వాసం ఆకాశాన్ని అంటుకున్నటుగా కనుమరుగైపోవును. అదే విధముగా పవిత్ర ఖుర్ఆన్ ఒకవిధముగా అల్లాహ్ తాలా వైపు ఎత్తుకోబడినట్లుగా వదిలివేయబడును. అని అర్థం చేసుకోవచ్చును. "

(ఇజాలే అవ్‌హాం, రుహాని ఖజాయిన్ సంపుటి 3, పుట 455)

మరల ఇలా తెలిపారు: " ఈ పరిస్థితులు నెలకొన్నప్పుడు ఫారిసీయులకు చెందిన ఒక వ్యక్తి ముందుకు వచ్చి అతడు ధర్మమును నూతనముగా స్థాపించును, అదే విధముగా ధర్మము, పవిత్ర ఖుర్ఆన్ బోధనలను క్రొత్తగా ప్రారంభించును. పవిత్ర ఖుర్ఆన్ వైభవాన్ని, మరిచిపోయిన మార్గదర్శకాలను, కృతీకా నక్షత్రముపై ఉన్నటు వంటి విశ్వాసాన్ని మరల ఈ ప్రపంచంలో వ్యాపింపజేయును. "

ఒక ఇస్లాం సేవకుడిగా తన అవతరణ ఉద్దేశమును గూర్చి తెల్పుచూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు:

" మట్టిలో మరుగుపడిన ఖజానాలను ప్రపంచం ముందు బహిర్గతం చేయుటకు,అమూల్యమైన వజ్రవైడుర్యాలపై ఆపాదించబడిన అపవిత్ర ఆరోపణల బురదనుండి వాటిని శుభ్రముచేసి, పవిత్రముగా మర్చుటకు అల్లాహ్ తాలా నన్ను అవతరింపజేశాడు. ప్రతీ నీచుడి ఆరోపణలను, అపనిందలను దూరం చేసి పవిత్రముగా మల్చుటకు నేడు దేవుడు ఎంతో పౌరుషంతో ఉన్నాడు. "

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 38, 2003)

అల్లాహ్ తాలా నుండి అనుగ్రహించబడిన ఖుర్ఆన్ వాస్తవాలు, విజ్ఞతల ద్వారా ఒకవైపు వారు ఇతర మతాల సిద్ధాంతాలు మసీహ్ ప్రాణాలతో ఉండడం, త్రిఏక సిద్ధాంతం, దైవకుమారుడు మసీహ్, పాప పరిహారం, పునర్జన్మ, ప్రాచిన ఆత్మలు మరియు పదార్థాలు వంటి వాటిని ఖండించారు. మరోవైపు ముసల్మానుల తప్పుడు సిద్ధాంతాలను సంస్కరిస్తూ మసీహ్ మరణం, ప్రవక్తుత్వ కొనసాగింపు, ప్రవక్తల గౌరవం. మసీహ్ అవతరణ వంటి అంశాలను పవిత్ర ఖుర్ఆన్ ఆధారాలతో వివరించారు. అదే విధముగా ముసల్మానులలో వ్యాపించిపోయినా దురాచారములను కూడ పవిత్ర ఖుర్ఆన్ బోధనల ఆధారముగా ధర్మకర్తగా, న్యాయాధికారిగా అంతమొందించారు. అల్లాహ్ తాలా వారికి పవిత్ర ఖుర్ఆన్‌కు ప్రతి రూపంగా అనర్గాళమైన, స్పష్టమైన అరబి బాషను నేర్పించాడు. ఫలితముగా వారు సుమారు 20 వరకు అరబి రచనలు చేశారు. ఆయా రచనలలో "ఏజాజుల్ మసీహ్" కూడ ఒకటి. ఈ పుస్తకంలో వారు (అ) ఫాతిహా అధ్యాయపు విశ్లేషణను పేర్కొన్నారు. హుజూర్ అలైహిస్సలాం ఈ విశ్లేషణను గూర్చి దైవవాణి ఆదేశము మేరకు ఈ విధముగా తెలిపారు: "ఒకవేళ వ్యతిరేక పండితులు మరియు అధికారులు, ధర్మశాస్త్ర నిపుణులు మరియు వారి తండ్రులు, కుమారులు అందరు ఏకాభిప్రాయాన్ని కుదుర్చుకొని ఇలాంటి విశ్లేషణనకు ఉదాహరణను తీసుకరావడానికి ప్రయత్నించిన కూడ వారు ఎన్నడు తీసుకరాలేరు. "

(ఏజాజ్‌యే మసీహ్, రుహాని ఖజాయిన్ సంపుటి 18, పుట 56, భావరీత్య).

| అహ్‌దీస్ బోధనలు | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

దుఆ ఆశించువారు: ***Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

| అహ్‌దీస్ బోధనలు | **"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

దుఆ ఆశించువారు: ***Muhammad Vazeer Ahmad sb Babu,***

(తఫ్సీర్ 1వ పేజి తరువాత)

ఫలితముగా వారు బీదవారికి, నిరుపేదలకు భోజనం తినిపిస్తున్నారు అనే ఆలోచన కూడ కల్గవచ్చును. అందుకే అల్లాహ్ తాలా ఇట్టి అనుమానంను నివృత్తి చేశాడు. ఆ క్రమంలోనే ఇలా తెలిపాడు. వారు ధనమును ఖర్చు చేసేవారు, వారు తమ ఒంటెలను కోసి వండించేవారు. కాని ఆకలి దప్పికలు గల రోజులలో కాదు. అనగా అవసరం ఉన్నప్పుడు వారు ఒంటెలను కోసి వండించి, తినిపించేవారు కాదు. వారికి తమ ప్రతిష్టను చూపించుకోవాలనే ఆలోచన కల్గినప్పుడు మాత్రమే వారు ఆ మత్తులో ఒక్కరోజులోనే వందలాది ఒంటెలను కోసి విందును ఏర్పాటు చేసేవారు. నిజానికి వారు వాస్తవ పరిస్థితులను దృష్టి యందుంచుకోని తమ మిత్రులకు విందు ఇవ్వడం కోసం ఒక ఒంటెను కోసి, మిగిలిన 99 ఒంటెలను పేదవారి కొరకు, నిరుపేదల కోసం ప్రక్కన పెట్టిన సమయస్ఫూర్తితో వ్యవహరించినచో వారికి ఆకలి దప్పికలతో తల్లడిల్లవలసిన పరిస్థితి వచ్చేది కాదు. ఏది ఏమైన వారు జాతి ప్రయోజనాలను దృష్టియందుంచుకోలేదు మరియు అనవసర సమయంలో ఖర్చు చేశారు కావున దానిని వ్యర్థమైన చర్యగానే చెప్పవచ్చును. అందువలన మా దృష్టిలో వారు ఎలాంటి ప్రశంసలకు అర్హులు కారు. ప్రజల చేత గౌరవించబడే అర్హత కూడ వారికి లేదు.

ఇచ్చట నిరుపేదలతో పాటు జా మఖ్రబత అనే పదాన్ని జోడిస్తూ తెల్పిన విషయమేమనగా, బంధుమిత్రులకు చెందిన నిరుపేదలను నిశ్చయముగా మానవులు తమ పర్యవేక్షణలో ఉంచుకోవలసి ఉంటుంది. వారి భోజన, వస్త్ర, బోధనల ఖర్చులను మానవుడు భరించవలసి ఉంటుంది. ఆఁ కొందరు వ్యక్తులు ఈ బాధ్యతలను ఇష్టపూర్వకముగా స్వీకరిస్తుంటారు, మరికొందరు అయిష్టముగా స్వీకరిస్తారు. ఇదే వేరే ఆంశం. కాని బంధుత్వ బాధ్యత మేరకు మానవుడు తమ సమీప నిరుపేదల బాధ్యతలను తప్పకుండా నిర్వహించవలెను. కాని వాస్తవం ఏమిటనగా, మీరు అలాంటి మీ సమీప బంధు నిరుపేదలకు కూడ సరిగా భోజనం తినిపించరు. దీని ద్వార మీరు చాలా అధోగతి స్థితిలో ఉన్నారనే విషయం స్పష్టమవుతుంది.

బంధుత్వంగల నిరుపేదలకు మాత్రమే భోజనం పెట్టాలి, మిగిలిన వారికి భోజనం పెట్టకూడదని ఈ సూక్తి అర్థం కాదు. ఈ సూక్తి అర్థమేమనగా, నిజానికి మీరు మీ సమీప బంధుత్వ నిరుపేదలను పోషించుతారనే నమ్మకం లేనప్పుడు, వారి అవసరాలు తీర్చుతారనే నమ్మకం లేనప్పుడు మీరు అపరిచిత నిరుపేదలను ఏ విధముగా పోషించగలరు?. మీరు మీ సమీప బంధుత్వపు నిరుపేదల మంచి చెడుల విషయంలో ఇంతటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నప్పుడు, దూరపు, అపరిచిత నిరుపేదల బాధ్యతలను చెల్లించుటకు మీకు మనస్సు ఎలా వస్తుంది?.

(తఫ్సీరే కబీర్ సంపుటి 8, పేజి 624, ప్రచురణ ఖాదియాన్)

## గౌ॥ రాజకుమారి అమతుల్ జమీల్ సాహెబా గారి విశిష్టతల ప్రస్తావన.

సయ్యదినా హజ్రత్ అఖ్దస్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు తమ 6 మార్చి 2026 నాటి జుమా ప్రసంగంలో హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్హు గారి చిన్న కుమార్తె గౌ॥ రాజకుమారి అమతుల్ జమీల్ సాహెబా గారి మరణ విషాదపు వార్తను తెలియజేస్తూ వారి విశిష్టతలను ప్రస్తావించారు. ఆ వివరాలు సంక్షిప్తముగా ఇచట గలవు.

గౌ॥ రాజకుమారి అమతుల్ జమీల్ సాహెబా గారు హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్హు గారి చిన్న కూతురు. నాసిర్ మహ్మూద్ సియాల్ సాహెబ్ గారి శ్రీమతి. హజ్రత్ చౌద్రీ ఫతహ్ ముహమ్మద్ సియాల్ రజి గారి కోడలు. 89 సంవత్సరాల వయస్సులో మృతి చెందారు. మృతురాలు వసియ్యత్ చేశారు. వీరు హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్హు గారి శ్రీమతి అయినా హజ్రత్ సయ్యదా మర్యం భేగం సాహెబా గారి ద్వార జన్మించారు. మరియు హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి గారి చివరి కుమార్తె.

వీరి నిఖాను 1955లో హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి గారు స్వయముగా చదివించారు. ఆ సమయంలో హుజూర్ రజి గారు అనారోగ్యంతో ఉండడం వలన పడుకోనే నిఖా ప్రకటన చేసి దుఆ చేయించారు. ఈ నిఖాలో కేవలం కుటుంబ సభ్యులు మాత్రమే పాల్గొన్నారు. హుజూర్ ఇలా తెలిపారు. ఈ నిఖా ప్రకటన ప్రారంభం నుండి చివరి వరకు హుజూర్ రజిగారిపై ఒక ప్రత్యేక స్థితి నెలకొన్నది. 1956లో వీరి వివాహం జరిగింది. వీరికి నలుగురు సంతానం. ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తేలు. కుమారుడు జాయిర్ ముస్తఫా సాహెబ్ మరియు కుమార్తె యాస్మీన్ గార్లు కెనడాలో ఉన్నారు. సాదియా అహ్మద్ సాహిబా అనే కుమార్తె యు.కేలో, సూఫీయా అహ్మద్ సాహిబా అనే మరో కుమార్తె గౌ॥ రాజకుమారులు మిర్జా సమద్ అహ్మద్ సాహెబ్ నాజిర్ ఖిద్మత్ దర్వేషాన్ రబ్వా గారి శ్రీమతి.

గౌ॥ నాసిర్ ముహమ్మద్ సియాల్ గారు జీవిత సమర్పితులు. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి గారు ఫజ్లే ఉమర్ రిసర్చ్ సెంటర్ ప్రారంభించిన తరుణంలో వారిని అందులో రిసెర్చ్రుగా నియమించారు. ఆ తరువాత వారికి తమ పని చేసుకోవడానికి జమాఅత్ అనుమతిని ఇచ్చింది.

మరల ఇలా తెలిపారు: మృతురాలు పేదల పెన్నిది. వారిమరణం తరువాత వారి కొన్ని లెక్కలను పరిశీలించగా, వారు పేదల పట్ల ఎంతటి ఆప్యాయతను చూపించేవారనే విషయం తెలిసింది. వారిని గూర్చి హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి గారి కొన్ని ఘటనలు, కొన్ని దైవస్వప్నాలు కూడ ఉన్నాయి. జీవిత సమర్పితులను చాలా గౌరవించేవారు.

వారు 7 సంవత్సరాల వయస్సులో ఉండగానే వారి తల్లి గారైన హజ్రత్ సయ్యద మర్యం సిద్ధీఖా సాహెబా గారు మృతి చెందారు. ఆ సమయంలో వారు చాలా దు:ఖంతో ఏడ్చారు. అప్పుడు హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి వారిని ఈ విధముగా ఓదార్చారు. చూడు! మీ అమ్మగారు అల్లాహ్ వద్దకు వెళ్ళారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందారు, మీ తాతా (హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ) గారు మృతి చెందారు. అలాంటప్పుడు మీ అమ్మ వారి కంటే గొప్పవారా?. ఆ తరువాత వారు ఎన్నడు ఏడ్వలేదు.

రాజకుమారి అమతుల్ జమీల్ సాహెబా గారి విశిష్టతలను ప్రస్తావించుతూ వారికి చెందిన హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజిగారి కొన్ని దైవస్వప్నాలను గూర్చి తెలియజేశారు.

మరల ఇలా తెలిపారు. వారు క్రమం తప్పకుండా చందాలు చెల్లించేవారు. ముందే ఆస్థికి చెందిన లెక్కలు వేసి చెల్లింపులు చేశారు. జమాఅత్ సభ్యుల కోసం నిరంతంర దుఆలు చేసేవారు. ఎవరి కోసం దుఆలు చేయవలసి ఉందో వారి పేర్లను వ్రాసి పెట్టుకునేవారు.

అల్లాహ్ తాలా వారి పట్ల కరుణా, దయ స్వభావంతో వ్యవహరించుగాకా!. ఉన్నత స్థానమును కల్పించుగాకా! ఆమీన్.

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | "అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. " (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

## నజారత్ తాలీమ్ ఖాదియాన్ వారి వ్యాస రచన పోటి బహుమతుల ప్రకటన:-

భారతదేశంలో ఉన్నటు వంటి అహ్మదీయ విద్యార్థుని, విద్యార్థుల, యువతి, యువకుల, వయోజనుల, మహిళల రచన సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం, వారి అంతర్గత నైపుణ్యతలను బయటికి తీయడం కోసం ప్రతి సంవత్సరం నజారత్ తాలీమ్ శాఖ వారు బహమతితో కూడిన వ్యాస రచన పోటిలను నిర్వహిస్తుంటారు.

ఈ సంవత్సరం అనగా 2025-2026వ విద్యా సంవత్సరం కోసం వ్యాస రచన పోటిల శీర్షికలు ఈ విధముగా ఉన్నాయి.

1) గ్రూప్ **A : 8** తరగతి నుండి 12వ తరగతి వరకు గల విద్యార్థిని విద్యార్థులకు గాను....

**"నమాజ్ విశ్వాసాన్ని మరియు దైవ సామిప్యంను పొందుటకు మార్గం."**

2) గ్రూప్ **B :** గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ మరియు పి. ఎచ్. డి విద్యార్థిని విద్యార్థులకు గాను...

**" సయ్యదినా హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా ఆకాంక్ష మేరకు ప్రపంచ శాంతి స్థాపనకై అహ్మదీయ యువతి యువకుల కృషి మరియు బాధ్యత".**

ఈ వ్యాస రచన పోటిలో ప్రథమ, ద్వితిత, తృతియ స్థానాలను పొందిన విద్యార్థిని విద్యార్థుల పేర్లను ప్రకటించడం జరుగుతుంది. వారి వివరాలు ఈ క్రింది విధముగా ఉన్నాయి.

### వ్యాస రచన పోటి బహుమతి: 2025-26

గ్రూప్ A :

**1) ఫారాన్ అహ్మద్ సాహెబ్, ఖాదియాన్, ప్రథమం, 2500**
**2) అయిన్ నూహ్, మంజీశ్వర్, కెరళా, ద్వితియం, 500**
**3) అఫ్రోజ భేగం సాహిబా, షీదా బారి, అస్సాం, తృతియం, 500**

గ్రూప్ B :

**1) అమతుల్ ముజీబ్ సుల్తాన సాహిబా, షిమోగ, కర్ణాటక, ప్రథమం, 5000**
**2) తాషిఫా ఆసిఫ్ సాహిబా, మహ్బూబ్ నగర్, తెలంగాణ, ద్వితియం, 3000**
**3) సయ్యద సఅదియ హమీద్ సాహిబా, హైదరబాద్, తృతియం, 2000**

**(నాజిర్ తాలిమ్ , సదర్ అంజుమన్ అహ్మదియ్య ఖాదియాన్).**

(12వ పేజి తరువాత చదువుము)

పరలోక జీవితాన్ని కేవలం ఒక కథలాగా భావిస్తున్నారు. అంతేగాకుండా ప్రతి వ్యక్తి తన నడవడిక ద్వార, తనకు ప్రపంచం మరియు ప్రపంచ సామాగ్రిపై నమ్మకం ఉన్నట్లుగా, ప్రపంచం మరియు దాని సామాగ్రిపై విశ్వాసం ఉన్నట్లుగా అల్లాహ్ తాలా మరియు పరలోక జీవితంపై నమ్మకంగాని, విశ్వాసం గాని లేదని చెప్పకనే చెబుతున్నాడు. వారి నోటి నుండి ఎన్నో విషయాలు వెలువడుతున్నాయి, కాని మనస్సుపై మాత్రం ప్రాపంచిక ప్రేమయే ఆధిక్యతను చాటుచున్నది. హజ్రత్ మసీహ్ కూడ ఇలాంటి స్థితిలోనే యూదులు ఉండడాన్ని చూశారు. విశ్వాస బలహీనతకు ఉండే ప్రత్యేకత ప్రకారంగానే యూదుల వ్యవహార శైలి కూడ చాలా నీచముగా మారిపోయింది. దేవుని ప్రేమ చల్లబడిపోయింది. నేడు నా కాలంలో కూడ ఇదే పరిస్థితి గలదు. కావున నిజాయితి మరియు విశ్వాస కాలం తిరిగి రప్పించబడుటకు, హృదయాలలో దైవభీతి జనింపజేయుటకు నేను పంపబడ్డాను. కావున ఈ కార్యములే నా అవతరణ యొక్క ప్రధాన అంశాలు. చాలా దూరమైన తరువాత మరల ఆకాశం భూమండలానికి దగ్గరికి చేయబడుతుందని నాకు చెప్పడం జరిగింది.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు మరల ఇలా తెలిపారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్ చేశామని ప్రకటించుకునే మనం, ఎంత వరకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి అవతరణ ఉద్దేశాన్ని నెరవేర్చుతున్నామని మనం ఆత్మ విమర్శన చేసుకోవాలి. నేను విశ్వాసాన్ని పటిష్టం చేయుటకు వచ్చాను అని, వారిలో పటిష్టతను ఏర్పర్చుటకు వచ్చాను అని హుజూర్ అలైహిస్సలాం పేర్కొన్నారు. కావున మన విశ్వాసం పటిష్టత వైపు మరలుచున్నదా? అని మనం పరిశీలించుకోవలసిన అవసరం ఉన్నది. మరల ఇలా తెలిపారు. అల్లాహ్ తాలా ఉనికి నిరూపించబడడం ద్వారా, అల్లాహ్ తాలాపై సంపూర్ణ విశ్వాసంను కల్గియుండడం ద్వారా విశ్వాసం పటిష్టతకు చేరుకుంటుంది. మరల ఇలా తెలిపారు. నేటి ప్రపంచంలో అల్లాహ్ తాలాపై ఉండే నమ్మకం కంటే ప్రపంచంపై మరియు ప్రాపంచిక సౌకర్యాలపై ఎక్కువ నమ్మకం ఉన్నది. అల్లాహ్ తాలా వైపు దృష్టిని కేంద్రీకరించుటకు బదులుగా, ప్రపంచం వైపు దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. అల్లాహ్ తాలాపై ఉండవలసిన నమ్మకం నామ మాత్రముగా మిగిలిపోయింది. ప్రపంచీకులకు, ప్రపంచ సాధానలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఒకవేళ మనం మన చుట్టు ప్రక్కల చూసుకున్నచో ఈ పరిస్థితులే మనకు కనిపిస్తుంటాయి. కాని మనం మన చుట్టు ప్రక్కల కేవలం ప్రపంచీకులు అల్లాహ్ తాలాకు కాకుండా ప్రపంచానికే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారా? లేదా? అని తెలుసుకోవడానికి చూడకూడదు. నిజానికి మనం ప్రాపంచిక సాధానలపై ఎక్కువ మక్కువను పెంచుకుంటున్నామా? లేక అల్లాహ్ తాలాపై ఎక్కువ మక్కువను పెంచుకుంటున్నామా? అని మన ఆత్మ పరిశీలన చేసుకోవడానికి చూడాలి.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా తెలిపారు: ఒకవేళ మనం బైఅత్ చేసిన తరువాత కూడ అల్లాహ్ తాలాను గుర్తించవలసిన విధముగా మనం అల్లాహ్‌ను గుర్తించనిచో, బైఅత్ చేయడమనేది మనకు ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చదు. మనం తమను తాము అహ్మదీయులమని చెప్పుకోవడంలో ఎలాంటి విలువ ఉండదు. ఒకవేళ నేడు మనం మన ఈ ప్రాపంచిక నాయకులను ఆనందింపజేసే పనిలో ఉన్నచో, ఈ చింతన అల్లాహ్ తాలాను ఆనందింపజేయడం కంటె ఎక్కువ ఉన్నచో మనం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి అవతరణ ఉద్దేశాన్ని నెరవేర్చడం లేదని అర్థం. మనం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో చేసిన బైఅత్ వాగ్దానమును నెరవేర్చడం లేదని అర్థం. ఒకవేళ మనం ప్రాపంచిక ఆచార వ్యవహారలకు మన ధర్మంపై ప్రాధాన్యతను కల్పించుచున్నచో మనం అహ్మదీయులము అని పిలిపించుకోవడం కేవలం నామ మాత్రమే అని అర్థం.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా తెలిపారు.


హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: మాకు అల్లాహ్ తాలా అస్థిత్వంపై నమ్మకం ఉన్నదని, మేము అల్లాహ్ తాలాను అందరి కంటే గొప్ప వాడిగా విశ్వసించుతామని, అల్లాహ్ తాలా యొక్క అభిమానం ఇతర అభిమానాల అన్నింటిపై అధిక్యతను కల్గియున్నదని నోటి ద్వార వాగ్దానం చేసినప్పటికి నిజానికి మనస్సులో మాత్రం ప్రాపంచిక అభిమానమే అధికముగా ఉన్నది. ముసల్మానులు, ముస్లిమేతరులు ప్రతి ఒక్కరు ప్రాపంచిక అభిమానంలోనే మునిగి ఉన్నట్లుగా మనకు నలువైపుల నుండి కనిపిస్తుంది. ప్రాపంచిక చెడు వ్యసనాలు, నిర్లజ్జ వంటివి అల్లాహ్ స్మరణను దూరం చేశాయి. ఐదు పర్యాయములు నమాజ్ సల్పమని ముసల్మానులను ఆదేశించడమైనది. అల్లాహ్ ప్రీతి, అతనిపై గల అభిమానంతో నమాజ్ సల్పమని ఆదేశించడమైనది. కాని ఆచరణ విషయానికి వచ్చినచో అందుకు పూర్తి భిన్నమైన వ్యవహారమున్నది. ఒక అహ్మదీయులు ఈ కోణంలో ఇతరును పరిశీలించి చూసినచో , మనం మన నమాజ్‌లను అల్లాహ్ తాలా ఆదేశానికి అనుగుణముగా చదువుచున్నామా? లేదా?, మనం అల్లాహ్ తాలా ఆదేశానికి అనుగుణముగా మనం మన ప్రార్థనలను చేయుచున్నామా? లేదా? అని ముందుగా పరిశీలించుకోవలసిన అవసరం ఉన్నది. ఒకవేళ అలా లేనిచో అల్లాహ్‌తాలాపై విశ్వాసంను పటిష్టం చేయుటకు వచ్చానని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చేసిన వాగ్దానంను మనం తిరస్కరించిన వారము అవుతాము. హుజూర్ అలైహిస్సలాం అవతరణ యొక్క ఉద్దేశం సత్యకాలమును మరల స్థాపించడం. హుజూర్ అలైహిస్సలాం గారి అవతరణ యొక్క ఉద్దేశం ఆకాశమును భూమండలానికి సమీపంగా తీసుకరావడం. అనగా అల్లాహ్ తాలాతో సజీవ సంబంధాలను ఏర్పర్చడం.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా తెలిపారు: కేవలం మన విశ్వాస మరియు ఆచరణల లోపం వలన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి వాగ్ధానం అసత్యం కాజాలదు. హుజూర్ (అ) అవతరణతో ప్రారంభమైన అనుగ్రహం నుండి మనం భాగమును పొందలేక పోతుంటాము. మనం విశ్వసించాము అనే ప్రకటన కూడ కేవలం నామ మాత్రపు ప్రకటనే అనబడుతుంది. కావున ప్రక్కవారు ఏమి చేస్తున్నారు?, వారి విశ్వాసం ఎలా ఉన్నది?, వారి ఆచరణలు ఎలా ఉన్నాయి?, వారిలో ఎలాంటి బలహీనతలు ఉన్నాయి? అని మనం ఇతరులను పరిశీలించే బదులు, తాము ఏమి చేస్తున్నాము?, ఏ స్థాయి మేరకు తమ బైఅత్ వాగ్దానంను నెరవేర్చుచున్నాము?, ఏ స్థాయి మేరకు మనం హుజూర్ అలైహిస్సలాం అవతరణ లక్ష్యమును నెరవేర్చుతున్నాము?, ఏ స్థాయి మేరకు సత్కార్యములను ఆచరిస్తున్నాము?, ఎంత వరకు మనం మన అవలక్షణాలను సరి చేసుకుంటున్నాము?, నేను ధర్మమునకు ప్రాపంచికతపై ప్రాధాన్యతను ఇస్తాను అని చేసిన వాగ్దానంను ఏ స్థాయి మేరకు నెరవేరుస్తున్నాము? అని స్వయముగా ఆత్మ పరిశీలన చేసుకోవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మన ముందు 10 బైఅత్ నిబంధనలను ప్రవేశ పెట్టారు. ఆపై ఒకవేళ మీరు నా జమాఅత్‌లో చేరాలనుకున్నచో, నిజమైన అహ్మదీయులుగా పిలువబడాలనుకున్నచో నాతో పటిష్టమైన అనుబంధాన్ని ఏర్పర్చుకోవాలని సూచించారు. ఈ బైఅత్ నిబంధనలకు అనుగుణముగా నడుచుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. వాటిని పదే పదే పఠిస్తు ఉండాలి, ఫలితముగా మీ విశ్వాసం పటిష్టమవుతుంది, మీ సుగుణాలు కూడ ఉన్నత స్థాయి ప్రామాణికతను చేరుకుంటాయి. ఉన్నతస్థాయి ప్రామాణికత వైపు అడుగులు పడుతాయి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనేక సందర్భాలలో మనకు బాధతప్తంతో హితోపదేశం చేశారు. అదేమనగా, నా వారిగా పేర్కొనబడే మీరు, నా బైఅత్ చేసిన వారిగా పిలువబడే మీరు, ఒకవేళ అహ్మదీయులుగా మారిన తరువాత మీలో సత్య మార్పులు రాకున్నచో మీకు మరియు ఇతరులకు ఎలాంటి వ్యత్యాసం లేదని అర్థం.

(తదుపరి సంచికలో)

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail:
teluguweeklybadar@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, - 09 APR 2026, Issue No - 15 .

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

## సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.

**హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు సిడ్నీ నుండి మెల్బోర్నియాకు ప్రయాణించడం. మెల్బోర్నియాలో హుజూర్ అన్వర్‌ను మనస్ఫూర్తిగా, సాధరముగా స్వాగతించడం.**

**వ్యక్తిగతమైన మరియు కుటుంబపరమైన జమాఅత్ సభ్యుల కలయికలు, ఆస్ట్రేలియాకు చెందిన జాతీయ మీడియా చానల్ ABC లో హుజూర్ అన్వర్ గారి ఇంటర్వ్యూ ప్రసారం.**

**(గత సంచిక తరువాయి భాగం)**

1922లో అహ్మదియ్య ముస్లిం జమాఅత్ అమెరికాకు చెందిన " దా ముస్లిం సన్ రైజ్ " అనే సంచికకు చెందిన 4వ సంచికలో వారి (రజి గారి ) ఒక వ్యాసం ప్రచురించబడింది. వారి రజి (గారి ఫోటో) కూడ ప్రచురించబడింది. వారు రజి తాము అహ్మదియ్యత్‌ను స్వీకరించిన విషయాన్ని ప్రస్తావించారు. వారు తమ వ్యాసంలో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారితో సమావేశమైన విషయాన్ని ప్రస్తావించుతూ ఈ విధముగా వ్రాసారు:

" నా తూర్పు దేశాల పర్యటనలో భాగంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారిని విషయంలో నన్ను హెచ్చరించడం జరిగింది. కాని నేను ఖాదియాన్ వెళ్ళిన తరువాతయే నా అనుమానాలన్నియు దూరమైపోయాయి. మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను గూర్చి అల్లాహ్ తాలా చేసిన భవిష్యవాణులు అన్నియు వారి (హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని(అ)) గారిలో పూర్తి గావించబడ్డాయనే ఆధారాలు నాకు ఒక అద్భుత ఆధ్యాత్మిక ప్రభావం ద్వార తెలిసి పోయింది. 1903లో ఖాదియాన్‌లో హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని (అ) గారిని కలవడం ఇస్లాం సత్యనిదర్శనకు ఎంతో అద్భుత ఆధారం. ఎవరి గురించి అయితే 13 శతబ్దాల ముందు భవిష్యవాణి రూపంలో పదాలను పేర్కొనడం జరిగిందో అవన్నియు వారి (హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని(అ))లో పూర్తి గావించబడ్డాయి. నా జీవితంలో నేను చేసిన పర్యటనన్నింటిలో చోటు చేసుకున్న సంఘటణల విషయానికి వచ్చినచో ఇలాంటి అద్భుత సంఘటన ఎన్నడు జరుగలేదు. నేను ఖాదియాన్ నగరంలో, ఆ నగరపు మసీహ్ ముందు నిలబడినప్పుడు, నన్ను వారి ముందు ప్రవేశపెట్టినప్పుడు, మా చూపులు కలిసినప్పుడు, వారు నన్ను చూడడంతోనే నేను సత్యాన్వేషణకు వచ్చానని వారు గ్రహించారు. నేటి కాలంలో విశ్వాసులను ఏకం చేయుటకు మరియు ఇస్లాంను ప్రపంచ వ్యాప్తముగా వ్యాపింప జేయుటకు అవతరింపబడిన ఆ దైవాంశజనుడు వీరే అని నేను అర్థం చేసుకున్నాను. అల్లాహ్ తాలాయే ఈ కలయిను ఏర్పాటు చేశాడని నేను విశ్వసించసాగాను. అతడే నా శరీరంలో, నా ఆత్మలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పట్ల అభిమానంను నింపాడు. చివరికి అనేక మాసాలు, ఆలోచించి, పరిశోధించి, దుఆలు చేసిన తరువాత ఏప్రిల్ 1906లో నేను అహ్మదియ్య ముస్లిం జమాఅత్ ఖాదియాన్‌కు చెందిన ఒక సభ్యుడిని అని ప్రకటన చేశాను. ఈ విధముగా నేను ప్రపంచ వ్యాప్తముగా ఇస్లామీయ బోధనలను వ్యాపింపజేయునట్టి అన్నిటి కంటే ఉత్తమమైన, చురుకైన ముహమ్మదిన్ మిష్నరీ అసోసియేషన్‌తో అనుబంధాన్ని పెంచుకున్నాను. ఈ ప్రకటనను నేను ప్రపంచంలోనే సూదుర దేశమైన న్యూజిలాండ్ నుండి పంపించడం జరిగింది.

నేను పైన వ్రాసిన అక్షరాలను, నిండు మనస్సుతో, పూర్తి నమ్మకంతోనే వ్రాసాను. నేటి నుండి 19 సంవత్సరాలకు పూర్వం నాకు నేను ఖాదియాన్‌లో వీడ్కొలు చెప్పుకున్నాను. ఆనాటి నుండి నేను వారి సత్యతను బలపరుస్తున్నాను. మరియు ముఫ్తి ముహమ్మద్ సాధిఖ్ సాహెబ్ రజి గారు ఇక్కడికి వచ్చిన తరువాత నేను ఈ ఆర్టికల్ ద్వార నేను అహ్మదియ్య ముస్లిం జమాఅత్ సభ్యుడినే అని నా వాగ్దానమును పునరుద్దరణ చేస్తున్నాను. గతంలో నుండే నేను ఇక్కడ ముఫ్తి ముహమ్మద్ సాధిఖ్ సాహెబ్ రజి గారికి సహాయం చేస్తూ వస్తున్నాను. ఇక ముందు కూడ భవిష్యత్తులో ఇస్లాం ప్రచార కార్యక్రమాలలో వారికి సహాయం అందిస్తూనే ఉంటాను.

వారు ముందుగా అమెరికాలోని కాలిఫోర్నియా, ఫ్రెష్నోలో జీవించేవారు. ఆ తరువాత 1914లో లాస్ ఏంజిల్‌కు వలస వెళ్ళిపోయారు. వారు లాస్ ఏంజిల్‌లోనే మృతి చెందారు. వారు మృతి చెందిన సంవత్సరం స్పష్టముగా పొందుపర్చబడలేదు. వారిని లాస్ ఏంజీల్‌లోని ఫారెస్ట్ లావన్ గ్లెండెన్ అనే ఖబరస్తాన్‌లో సమాధి చేశారు.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు తమ ఈ సంవత్సరపు లాస్ ఏంజిల్ (అమెరికా) పర్యటనలో అమెరికాకు చెందిన ముభల్లిఘ్ సిల్‌సిలా గౌ॥ ఇనాముల్ హఖ్ కౌసర్ సాహెబ్ గారికి క్రీ॥ శే॥ చార్లేస్ ఫ్రాన్సిస్ గారి కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్నారో, వారి సంతానం, వారి వారసులు ఎక్కడున్నారు? ఎక్కడికి వలస వెళ్ళారు? అనే విషయాలను కనిపెట్ట గలరని సూచించారు.

(అమెరికా జమాఅత్ ఈ విషయంలో తమ అన్వేషణలు చేస్తూనే ఉన్నది.)

### దివి: 11 అక్టోబర్ 2013, శుక్రవారం.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఉదయం 5గంటల 30 నిమిషాలకు మస్జిద్‌కు చేరుకోని ఫజర్ నమాజ్ చదివించారు. నమాజ్ తరువాత హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు తమ నివాసమునకు తిరిగి వెళ్ళారు.

ఉదయం వేళ హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అనేక శాఖలకు చెందిన కార్యాలయ కార్యక్రమాలను పూర్తి చేయుటలో ఉన్నారు.

ఈ రోజు శుభప్రదమైన శుక్రవారం రోజు కావున, అస్ట్రేలియాకు చెందిన మెల్బొనియా నగరం నుండి ఖలీఫతుల్ మసీహ్ గారి జుమా ప్రసంగాన్ని ఎంటిఏ ద్వారా మొదటి సారిగా ప్రపంచ వ్యాప్తముగా ప్రత్యక్ష ప్రసారంలో వినడం మరియు చూడడం జరుగుతుంది. గతంలో ఎన్నడు కూడ మెల్బొనియా నుండి ఎంటిఏ ప్రత్యక్ష ప్రసారాలు చేయలేదు. ఇంతకు ముందు ఎన్నడు ఖలీఫతుల్ మసీహ్ ఈ నగరంలో జుమా ప్రసంగం గాని, ఉపన్యాసం గాని చేయలేదు.

**అహ్మదియ్య సెంటర్ మెల్బోర్న్ ప్రారంభోత్సవం.**

నేడు " అహ్మదియ్య సెంటర్ మెల్బోర్న్ " ప్రారంభోత్సవం రోజు. మధ్యాహ్నం ఒంటి గంటకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు విచ్చేసి, బయటి గోడకు ఉన్నటు వంటి ఫలకపు వస్త్రాన్ని తొలగించి, ఆపై దుఆ చేశారు.

జుమా ప్రసంగం:

ఆ తరువాత హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు పురుషుల సభా ప్రాంగణంలోకి చేరుకోని జుమా ప్రసంగాన్ని ప్రారంభించారు.

తషహ్హుద్, తవూజ్ మరియు తస్మియ పఠనాంతరం హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా ప్రసంగించారు.

" హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక చోట ఇలా తెలిపారు. విశ్వాసాన్ని బలపర్చుటకు మరియు అల్లాహ్ ఉనికిని ప్రజల ముందు నిరూపించి చూపబడుటకు నేను పంపబడ్డాను. ఎందుకనగా ప్రతి జాతి యొక్క విశ్వాస స్థితి చాలా బలహీనముగా ఉన్నది. (11వ పేజిలో చదవగలరు)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz